ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



ఆదివారం | 06-09- 2026 | సంపుటి: 17, సంచిక: 155, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


## అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో

# దళారుల దందా







- పేరుకే ఎమ్మార్వో కార్యాలయం -పెత్తనమంతా దళారులదే
- కార్యాలయ సమయం ముగిశాక గేటుకు తాళం వేసి సిబ్బందితో కలిసి దళారుల దందా
- ధృవపత్రాలు కావాలంటే సామాన్యుల జేబులు గుల్ల
- పైసలిస్తే ఫైలు కదులుతుంది లేదంటే రిజక్ట్ అవుతుంది
- అధికారులతో కలిసి సామాన్య జనాన్ని ముంచుతున్న వైనం
- దళారులకు అధికారులకు మధ్య నలుగుతున్న సామాన్య జనం
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న అధికారులు,సిబ్బంది
- జవాబుదారీతనం లేని అధికార యంత్రాంగం
- అధికారులు,కిందిస్థాయి సిబ్బంది చేసే ఇలాంటి వ్యవహారంతో ప్రభుత్వాలకు అపవాదు
- ప్రభుత్వ సంస్థలపైన ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుంది
- ఉన్నతాధికారులు నజర్ పెట్టకపోతే పరిస్థితి మరింత దారుణం

ప్రజా కలం ప్రత్యేకం..

అంబర్‌పేట్ సెప్టెంబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి)

అంబర్పేట్ తాహషిల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధృవపత్రాలు తదితర గుర్తింపు పత్రాల కోసం ఈసేవా,మీసేవా కేంద్రాలలో ధరఖాస్తు చేసుకున్నాక నెలల తరబడి వేచి చూసినా సర్టిఫికెట్స్ రావడం లేదు. దీంతో బాదితులు ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి సంప్రదించగా అనేక కొర్రీలు పెట్టి రిజెక్ట్ చేస్తున్నారని వాపోతున్నారు. కారణం అక్కడ ఆమ్యామ్యాలు ముట్టనిదే ఇక్కడ ఫైలు ఒకే కాదు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా రెండు నుంచి మూడు వేల రూపాయలు ఖర్చు అవుతుందని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కిందిస్థాయి సిబ్బందిని,దళారులను మధ్యవర్తులుగా చేసుకొని అందిన కాడికి దండుకుంటూ సామాన్యులను పట్టిపీడిస్తున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మరి ముఖ్యంగా అంబర్పేట్ తాసిల్దార్ కార్యాలయంలో దళారి వ్యవస్థ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుంది.

తరువాయి 2వ పేజీలో...

## హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

**రూ.70 వేల కోట్ల పెట్టుబడి - 7 వేల మందికి ఉద్యోగాలు**

**TCS-HyperVault ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం**



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ప్రజాకలం) : హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో శనివారం సచివాలయంలో సమావేశమైంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్, సీఓఓ ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి. రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికానుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా

తరువాయి 2వ పేజీలో...

## మైనారిటీ సంక్షేమ సంస్థలు

# సమన్వయంతో పనిచేయాలి



**: మంత్రి అజహరుద్దీన్**

హైదరాబాద్, సెప్టెంబర్ 5: మైనారిటీల సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాలు, సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ సమస్యల పరిష్కారానికి వేగంగ చర్యలు తీసుకోవాలని మైనారిటీల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ గారు అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో మైనారిటీల సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ సంస్థల చైర్మన్లు, శాఖాధిపతులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు తగిన గుర్తింపు, ప్రచారం లభించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. తమ పరిధిలోని సమస్యలను జాబితా రూపొందించుకుని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. తాను తన వద్దకు వచ్చే ఫైళ్లను వెంటనే పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా

తరువాయి 2వ పేజీలో...

## మోదీనే వణికిపోయారు..

# రేవంత్ ఎంత!

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



కరీంనగర్, సెప్టెంబర్ 5 (ప్రజాకలం) : యువతరం పోరాటానికి ప్రధాని మోదీనే వణికి పోయారు.. రేవంత్ రెడ్డి ఎంతని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

- రైతు నుంచి పేదల వరకు.. అందరికీ కాంగ్రెస్ అండ
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై కాంగ్రెస్ భారీ ర్యాలీ
- బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,సెప్టెంబర్ 05: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదవాడికి ఉపయోగపడే పథకాలు తెచ్చామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 1000 రోజుల ప్రజా పాలన-ప్రజా సంక్షేమ దినోత్సవాలను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని చీకురాయి రోడ్ నుంచి జెండా చౌరస్తా వరకు రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు నేతృత్వంలో భారీ ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ అభివృద్ధి,సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని,ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500కే గ్యాస్ సిలిండర్,రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజలకు ఉపయోగపడే పథకాలను కూడా కొనసాగిస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రైతును రాజును చేస్తామని ఇచ్చిన మాటకు అనుగుణంగా రైతు సంక్షేమానికి ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని విజయరమణ రావు అన్నారు.

తరువాయి 2వ పేజీలో...



## యువత భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

3

## కలం కౌంటర్



## రూ.18,250 కోట్ల ధాన్యం కొనుగోళ్లకు

# పకడ్బందీ ప్రణాళిక

**లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలి: మంత్రి ఉత్తమ్ ఆదేశం**



- వానాకాలంలో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు తెలంగాణ సన్నద్ధం
- అక్టోబర్ 1 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలు
- దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌పై అధ్యయనం అనంతరం ఏడు సన్న రకాల ఎంపిక
- తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ప్రజాకలం) : రూ. 18,250 కోట్ల అంచనా విలువతో చేపట్టనున్న వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ కార్యాచరణను అమలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి రాకూడదని, ధాన్యం విక్రయించిన అనంతరం నగదు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అదనపు కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో శనివారం మట్టి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శనివారం రోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్-2026-27లో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం సన్నద్ధమవుతోందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. వీటిలో 3,180 ఐకేపీ కేంద్రాలు, 4,372 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కేంద్రాలు,

తరువాయి 2వ పేజీలో...

## మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం:మంత్రి సీతక్క

- కొల్లాపూర్ మహిళా సంఘాలకు రూ.175 కోట్ల వడ్డీలేని రుణాల పంపిణీ
- రహదారులు, విద్యుత్, విద్యా రంగ అభివృద్ధికి భారీ నిధులు
- మంత్రి జూపల్లి కృష్ణారావు



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 05 ప్రజా కలం (ప్రతినిధి ):

మహిళలను కేవలం పొదుపు సంఘాలు, రుణ కార్యకలాపాలకే పరిమితం చేయకుండా వ్యాపారవేత్తలుగా, స్వయం ఉపాధి రంగంలో ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రతి మహిళ ఏదో ఒక వ్యాపారం లేదా స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగస్వామి కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కొల్లాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మహిళా సంఘాల సభ్యులకు నిరంతర ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమా ల్లో వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

**అంగన్‌వాడీ, పాఠశాల యూనిఫాంల తయారీ బాధ్యతలు మహిళా సంఘాలకే**

అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంల తయారీ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి నిరంతర ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# అంబర్‌పేట్ తాహాషిల్దార్ కార్యాలయంలో దళారుల దందా

మొదటి పేజీ తరువాయి...

ఉన్నతాధికారులు ప్రభుత్వ కార్యాలయాలలో ప్రక్షాళన చేపట్టకపోతే ప్రభుత్వ వ్యవస్థల పైన ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని మేధావులు అభిప్రాయపడు తున్నారు

**అంబర్పేట్ ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందితో కుమ్మక్కై దళారుల ఇష్టారాజ్యం**

అంబర్పేట్ ఎమ్మార్వో కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం నడుస్తుంది. ఒక్కోవ్యక్తి వందలాది అప్లికేషన్ ఫారాలు తెచ్చి దర్జాగా అధికారుల సీట్లలో కూర్చుని వారి ఫైల్స్ వారే చెక్ చేస్తున్నారంటే వారికి వీరికి ఎలాంటి సత్సంబంధాలు ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. దళారులు చేసే హడావిడి ఫైల్స్ చూడడాన్ని కార్యాలయ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

**ధ్రువపత్రాల జారీ ప్రక్రియ విదానం..**

ఒక వ్యక్తి సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ మీసేవ కేంద్రంలో గాని, ప్రైవేట్ మీసేవ కేంద్రంలో కానీ సరిఅగు పత్రాలు చూపి అప్లై చేసుకున్నాక ఆ పత్రాలను మీసేవ కేంద్రం వారు నేరుగా ఎమ్మార్వో కార్యాలయంలో సమర్పించాలి, తదుపరి ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది ఆ వ్యక్తి యొక్క చిరునామా వివరాల ఆధారంగా విచారణ జరిపి తను సమర్పించిన ఆధారాలు సరైనవి అనిపిస్తే అప్పుడు ధ్రువపత్రాలు జారీ చేయాలి. ధృవపత్రాల కోసం తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా తను



ఇచ్చిన పత్రాలలో ఏదైనా సమాచార లోపం ఉన్నా అప్పుడు తిరస్కరించాలి.

**ఇదంతా ఎమ్మార్వోకు తెలియకుండానే జరుగుతుందా..?**

దళారులకు అడ్డాగా మారిన అంబర్‌పేట్ తాహషిల్దార్ కార్యాలయంలో అధికారులతో కలిసి అమాయక ప్రజలను పీడించుకు తింటున్నారని ప్రజల్లో తీవ్రస్థాయిలో అనేక విమర్శలు ఉన్నాయి. దళారులు లేకుండా ఏ చిన్న ఫైలు కూడా ముందుకు కదలడం లేదని, ధృవపత్రాల జారీకి కూడా ఒక నిర్దిష్ట ధరను నిర్ణయించి వసూలు చేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇదంతా ఎమ్మార్వోకు తెలియకుండానే జరుగుతుందా..?**

ఎన్ని విమర్శలు ఎదురవుతున్న ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మార్వో పాత్రపై పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు స్థానికులు...

**అవినీతి అక్రమాలపై ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్**

ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యంగా ఎమ్మార్వో కార్యాలయాలలో జరిగే అవినీతి అక్రమాలపై ప్రభుత్వాలు, అవినీతి నిరోధక శాఖ ఎన్ని హెచ్చరికలు జారీ చేసినా, వ్యవస్థను ఆన్లైన్ డిజిటలైజ్ చేసినా క్షేత్రస్థా యిలో అవినీతి రూపాలు వివిధ రకాలుగా మారుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ఈ వ్యవస్థలో మార్పులు రావాలంటే కార్యాలయ సిబ్బందిలో అధికారుల్లో మార్పు రావాలంటే ప్రభుత్వం ఇంకా కఠినమైన నిబంధనలు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**అంబర్పేట్ ఎమ్మార్వో వివరణ కోసం ఓ జర్నలిస్టు నాలుగు గంటల నిరీక్షణ**

అంబర్పేట్ తాసిల్దార్ కార్యాలయంలో పని నిమిత్తం ఓ జర్నలిస్టు వెళ్లగా కళ్ళు బైర్లు కమ్మే సంఘటనలు కళ్ల ముందు జరుగుతున్నాయి. వ్యవహారమంతా కళ్లారా చూసిన జర్నలిస్ట్ డిప్యూటీ ఎమ్మార్వోను కలిసి మీతో మాట్లాడాలని కోరగా నాకు సర్ ప్రోగ్రాం ఉంది నేను కలవలేను అని వెళ్ళిపోయారు. ఎమ్మార్వో వచ్చాక వివరణ కోసం ఆ విలేఖరి 4 గంటల పాటు నిరీక్షించినా, సిబ్బందితో కబురు పంపినా తాసిల్దార్ అనుమతి ఇవ్వకపోవడం మీడియా పైన వారికి ఏమాత్రం గౌరవం ఉందో ఇట్టే అర్థమవుతుంది.

**మరింత సమాచారం తదుపరి శీర్షికలో**

# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

మొదటి పేజీ తరువాయి...

సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్ తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు.

తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు.

టీసీఎస్? తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది.

# మోదీనే వణికిపోయారు.. రేవంత్ ఎంత!

మొదటి పేజీ తరువాయి...

కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో యువతను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ 1,000 రోజుల దగాపై యువ సమరభేరి సభలో కేటీఆర్ పాల్గొన్నారు. నిరుద్యోగుల సమస్యలపై రాహుల్ గాంధీ ఇప్పుడు ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఈ అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్నారు. తెలంగాణను దశాబ్దాలపాటు కాంగ్రెస్ మోసం చేసిందన్న కేటీఆర్ అలాంటి కాంగ్రెస్ ను నమ్మి తెలంగాణ ప్రజలు మోసపోయారని వెల్లడించారు. అప్పుడు యూత్ డిక్లరేషన్.. ఇప్పుడు బూతు డిక్లరేషన్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు స్కిల్ లేదని రేవంత్ రెడ్డి అంటున్నారు.. సీఎం రేవంత్ కు స్కిల్ ఉందా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలని అంటున్నారు.. తెలంగాణ తీసుకొచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా? వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్ రాజీనామా చేయాలా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. 1000 రోజుల్లో కాంగ్రెస్ 16 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రీ-నోటిఫికేషన్ల తీసేస్తే 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాల్లో స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. పదేళ్లలో 2.32 లక్షల ఉద్యోగాలు తాము భర్తీ చేశామని లెక్కచెప్పారు.

# మైనారిటీ సంక్షేమ సంస్థలు సమన్వయంతో పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి...

పరిష్కరిస్తున్నానని అజహరుద్దీన్ గారు తెలిపారు. అదే విధంగా అధికారులు కూడా తమ పనుల్లో వేగం పెంచాలని, 'సంక్షేమం' అనే పదానికి నిజమైన అర్థం వచ్చేలా పనిచేయాలని సూచించారు.

సమీక్షా సమావేశంలో వక్ఫ్ బోర్డు, ఉర్దూ అకాడమీ, షాహీ మసీదు, TGMREIS, ఖాజీలకు సంబంధించిన అంశాలతో పాటు మైనారిటీల సంక్షేమ శాఖ పరిధిలోని ఇతర సంస్థలకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, IAS, కార్యదర్శి బి. షఫీఉల్లా, IFS, TGMREIS అధ్యక్షుడు ఫహీమ్ ఖురేషీ, హజ్ కమిటీ చైర్మన్ గులాం అఫ్జల్ బియాబానీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబైదుల్లా కోత్వాల్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీవక్ జాన్ తదితర అధికారులు హాజరయ్యారు. మైనారిటీ సంక్షేమ సంస్థల చైర్మన్లు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వానికి విమర్శలకు తావులేకుండా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా ఫహీమ్ ఖురేషీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రభుత్వ పనితీరుపై ప్రతిపక్షాలు విమర్శించేందుకు ఎలాంటి అవకాశం లేకుండా అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పనితీరును వివరించే సమాచారంతో వక్ఫ్ బోర్డు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, శ్మశానవాటికలు, సమాధుల స్థలాలకు సంబంధించిన వివాదాస్పద అంశాలు సహా పలు సమస్యలను కలెక్టర్ల సమావేశం అజెండాలో చేర్చాలని సూచించారు. తద్వారా ఇటువంటి సమస్యలను సకాలంలో పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు.

మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీఉల్లా పలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మైనారిటీల సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ సంస్థలు సజావుగా పనిచేసేందుకు వాటిని పరిష్కరించాలని కోరారు. తన శాఖ పరిధిలోని విభాగాల పనితీరుకు ఎలాంటి పరిపాలనా అవరోధాలు ఎదురుకాకుండా చూస్తానని మంత్రి అజహరుద్దీన్ హామీ ఇచ్చారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రవ్యాప్తంగా సన్నధాన్యానికి రూ.1,540 కోట్ల బోనస్ చెల్లించగా, పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు రూ.80.68 కోట్ల బోనస్ అందించామని తెలిపారు. రైతుల నుంచి గింజ కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లతో ఒక్కో రైతుకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేసి, తిరిగి బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. గతంలో వరి సాగుపై ఆంక్షలు విధించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం రైతులకు బోనస్ అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి విమర్శలు చేయడం సరికాదన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రాన్ని గుడిసెల రహిత తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందిస్తామని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు కాగా, తొలి విడతలో 3 వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. మరో పది రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెద్దపల్లి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని విజయరమణ రావు అన్నారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.88 కోట్లు విడుదల చేయించామని, పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. భూసేకరణ కోసం మరో రూ.80 కోట్లు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు విస్తరించేందుకు రూ.53 కోట్లు మంజూరు కాగా, నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. పెద్దపల్లిలో ఆర్టీవోబీ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరో రెండు మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసిందని విజయరమణ రావు ఆరోపించారు. రూ.40,350 కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోందని అన్నారు. సర్పంచులకు బకాయిలు పెట్టింది కూడా గత ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన బాధతో బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేయలేని అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ కాలంలోనే చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మహిళల...

# రూ.18,250 కోట్ల ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి...

మరో 731 ఇతర కొనుగోలు కేంద్రాలు ఉంటాయని వివరించారు. అక్టోబర్ 15 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో అక్టోబర్ 1 నాటికే అన్ని కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా నిర్ణయించిందని తెలిపారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఏడు ప్రాధాన్య సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు చెప్పారు. బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ-సోనా, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 రకాలకు ఈ బోనస్ వర్తిస్తుందని వెల్లడించారు. ఈ ఏడు రకాలను ఏకపక్షంగా ఎంపిక చేయలేదని, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న డిమాండ్‌ను శాస్త్రీయంగా అధ్యయనం చేసిన అనంతరమే మెరుగైన ధర లభించే అవకాశమున్న రకాలను గుర్తించామని వివరించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినా, బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నా రైతుకు గిట్టుబాటు ధర లభించాలన్నదే ప్రభుత్వ అంతిమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ బియ్యానికి దేశీయ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ స్థాయిలోనూ స్థిరమైన ఎగుమతి మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక వ్యూహాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొన్ని సందర్భాల్లో కొనుగోలు ధర కంటే తక్కువకు విక్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ బియ్యం ఎగుమతులను ప్రోత్సహించి, అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరమైన డిమాండ్‌ను సృష్టించగలిగితే రాష్ట్ర రైతులకు మెరుగైన ధర లభించడంతోపాటు ధరల వ్యత్యాసం కారణంగా ప్రభుత్వంపై పడుతున్న ఆర్థిక భారాన్ని కూడా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పంటల సాగు విధానంలో వస్తున్న సానుకూల మార్పులను మంత్రి ప్రస్తావించారు. సాధారణంగా వానాకాలం సాగు వర్షాలపై ఆధారపడి ఉండగా, యాసంగి వేసవి పంట కావడంతో గతంలో వానాకాలంతో పోలిస్తే యాసంగి ధాన్యం దిగుబడి తక్కువగా ఉండేదన్నారు. ప్రస్తుతం యాసంగి ధాన్యం ఉత్పత్తి వానాకాలం స్థాయికి చేరుకోవడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో దానిని అధిగమించడం తెలంగాణ వ్యవసాయ రంగంలో చోటుచేసుకున్న సానుకూల పరిణామమని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలంలో 57.70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిపారు.

ఇందులో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా 45 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కలిపి మొత్తం 65 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ధాన్యం రాక గరిష్ఠ స్థాయికి చేరుతుందని మంత్రి తెలిపారు. నవంబర్‌లో 24.72 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 25.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగానే గోదాములు, గన్నీ సంచులు, రవాణా వాహనాలు, హమాలీలు, తూకం మరియు నాణ్యత నిర్ధారణ పరికరాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రవాణా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించిన మంత్రి, టెండర్లలో పాల్గొనే రవాణా కాంట్రాక్టర్లకు అవసరమైన సంఖ్యలో లారీలు సొంతంగా ఉన్నాయా లేదా వాటిని సమకూర్చుకునే విశ్వసనీయ ఏర్పాట్లు ఉన్నాయా అనే విషయాన్ని ముందుగానే నిర్ధారించాలని సూచించారు. రవాణా లోపాల కారణంగా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు నిలిచిపోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఈ సీజన్‌కు మొత్తం 16.25 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయని, ప్రస్తుతం 3.50 కోట్ల సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సంచుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులు, రాష్ట్ర మరియు కేంద్ర గిడ్డంగుల సంస్థల గోదాములు, రైతు వేదికలు, ప్రభుత్వ భవనాలు, ఇతర అనుమతించబడిన ప్రదేశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి జిల్లా సమగ్ర నిల్వ ప్రణాళికను సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఆధారిత ట్రాకింగ్‌ను తప్పనిసరిగా అమలు చేయడంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి అనధికారికంగా ధాన్యం రాకుండా సరిహద్దు తనిఖీ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

"ధాన్యం కొనుగోలు యంత్రాంగం అంతా రైతు ప్రయోజనాల పరిరక్షణే పరమావధిగా పనిచేయాలి.

కొనుగోలు కేంద్రాలను నిరంతరం తనిఖీ చేయాలి. రైతుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి. తూకం, నాణ్యత పరీక్షల్లో పూర్తి పారదర్శకత పాటించాలి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలిస్తూ, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలి" అని మంత్రి స్పష్టం చేశారు. "రూ.18,250 కోట్ల విలువైన 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ప్రతి స్థాయిలోనూ సూక్ష్మ ప్రణాళిక అవసరం. రైతుకు సరైన ధర లభించాలి.

చెల్లింపులు సకాలంలో జరగాలి. ఏ దశలోనూ రైతుకు అసౌకర్యం కలగకూడదు" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంచాలకుడు శ్యామ్ ప్రసాద్, అదనపు సంచాలకుడు రోహిత్ సింగ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

అలాగే వరి కొనుగోళ్ల కార్యక్రమంలో మహిళా సంఘాలు భాగస్వామ్యం కావడం ద్వారా వారికి సుమారు రూ.2.53 కోట్ల కమిషన్ ఆదాయం లభించిందని పేర్కొన్నారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సోలార్ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

**ఇందిర మహిళా శక్తి భవనాల నిర్మాణం**

మహిళా సంఘలా సమావేశాలు కార్యకలాపాలు శాశ్వత వేదిక కల్పించేందుకు ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో ఇందిరా మహిళా శక్తి భవనం జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు మహిళా ఆర్థిక స్వాలంబన కొరకు ఉచిత బస్సు ప్రయాణం సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు

**కొల్లాపూర్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా**

కొల్లాపూర్ నియోజక వర్గం అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

**రహదారుల అభివృద్ధికి 500 కోట్లు నిధులు**

కొల్లాపూర్ నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి అభివృద్ధి కోసం ఇప్పటికే 500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు అదనంగా మరో 100 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు అలాగే విద్యుత్ మౌలిక వసతులు అవసరాలకు రూ.50 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని తెలిపారు

**జట్ ప్రోల్ 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్**

జట్రోల్లో సుమారు 2500 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు 200 కోట్లు వ్యయం అవుతుందని వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు

**మహిళా సంఘాల ఉపాధి అవకాశాల విస్తరణ**

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలతో పాటు సోలార్ విద్యుత్ యూనిట్లు ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పించే అవకాశాల దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు మహిళా సంఘాల ఆధ్వర్యంలో గొర్రెపిల్లలు నాటుకోడి పిల్లల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టి గ్రామీణ మహిళల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు

**పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు**

కొల్లాపూర్ నియోజక వర్గంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు మండలాల వారీగా సాంస్కృతిక భవనాలు స్పోర్ట్స్ స్టేడియాలు నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు

**డ్రగ్స్ నిర్మూలనపై సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అవగాహన**

డ్రగ్స్ నిర్మూలనతోపాటు వివిధ సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిర్వహించేందుకు కష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ప్రభాతభేరి కార్యక్రమాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు

**ఆడంబరాలకు పోయి అప్పుల పాలు కావొద్దు**

ప్రజలు తమ ఆదాయాన్ని అనుగుణంగా ఖర్చులు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణను పాటించాలని ఆడంబరాలకు పోయి అధిక ఖర్చులు చేసి అప్పుల పాలు కావద్దని మంత్రి జూపల్లి ప్రజలకు విజ్ఞప్తి చేశారు సెల్ ఫోన్లు సోషల్ మీడియాను వినోదానికి మాత్రమే కాకుండా విద్య వైద్య నైపుణ్యాల అభివృద్ధి ఉపాధి అవకాశాల కోసం సద్వినియోగం చేసుకోవాలని ఆయన యువతకు సూచించారు

**ప్రజా సంక్షేమం సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం ఎంపీ మల్లు రవి**

**175 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ**

ఈ కార్యక్రమంలో భాగంగా కొల్లాపూర్ నియోజక వర్గం లోని మహిళా సంఘాలకు 175 కోట్ల వడ్డీ లేని రుణాలను చెక్కులను పంపిణీ చేశారు ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఎంపీ అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కేశవ్ హేమంత్ పాటిల్ అదనపు కలెక్టర్ దేవ సహాయం ఆర్డిఓ బన్సీలాల్ అధికారులు ప్రజాప్రతినిధులు మహిళా సంఘాల సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## చెన్నూరులో కమ్యూనిటీ హాల్ భూమి పూజ



మంచిర్యాల జిల్లా//( సెప్టెంబర్ 5) ప్రజాకలం జిల్లా ప్రతినిధి

మంచిర్యాల జిల్లా: చెన్నూరు పట్టణంలోని స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వివేక్ వెంకటస్వామి హాజరై భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ సంఘ సభ్యుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషకరమని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే సంఘ కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కొమ్మెర జయలక్ష్మి, బ్రహ్మయ్య, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సురేష్, విజయగిరి రమేష్, కత్రోజు శేఖర్, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కట్ట రమేష్తో పాటు సంఘ నాయకులు, కుల పెద్దలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



రుద్రంగి, సెప్టెంబర్ 05,(ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని మానాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భముగా భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తమకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. గురువుల గొప్పతనం, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్రను వివరిస్తూ విద్యార్థులు పాటలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో వేడుకలు సందడిగా సాగాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతి, ఉపాధ్యాయులు మానస, గౌతమి, వాణి, ప్రియాంక మంజుల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### - ఆర్డీవో బీఎన్ఎస్ కుమారి

రుద్రంగి, సెప్టెంబర్ 05,(ప్రజాకలం ప్రతినిధి)

ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శంగా నిర్వహించాలని ఆర్డీవో కుమారి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో బీఎల్ఓలు చేపడుతున్న ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలను ఆర్డీవో



పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, పేరు, చిరునామా, వయస్సు, కుటుంబ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. ఒకే వ్యక్తికి బహుళ ప్రాంతాల్లో ఓట్లు ఉంటే నిబంధనల ప్రకారం నిర్ధారించాలని ఆదేశించారు. ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించాలని బీఎల్‌వోలకు సూచించారు. మొదటి సారి రుద్రంగి మండల కేంద్రానికి వచ్చిన ఆర్డీవో కుమారి ని స్థానిక సర్పంచ్ గండి నారాయణ ఘనంగా సత్కరించారు. ఆర్డీవో వెంట ఎంఆర్వో పుష్పలత ఉన్నారు.

## మెట్‌పల్లిలో ఘనంగా వనమహోత్సవం

### - ఐరిస్ స్కూల్‌లో మొక్కలు నాటి, ప్రజలకు మొక్కల పంపిణీ




మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాకలం)

ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని ఐరిస్ స్కూల్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడంతో



పాటు వార్డు ప్రజలకు పెద్ద ఎత్తున మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి హాజరై స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం స్థానికులకు మొక్కలను అందజేశారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, 18వ వార్డు కౌన్సిలర్ సిహెచ్. మీనా, మున్సిపల్ కౌన్సిలర్లు, మెట్‌పల్లి పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, నాయకులు సుఖేందర్ గౌడ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, మహిళలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

## 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

### యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పోరాటం – పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి




పెద్దపల్లి,సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులు,యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్,మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన పోరుబాటలో భాగంగా శనివారం పెద్దపల్లి పట్టణంలో విద్యార్థులు,యువతతో కలిసి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి భారీ ర్యాలీ నిర్వహించారు.నియోజకవర్గం లోని వివిధ మండలాల నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు,యువకులు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు.వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కమాన్,జెండా చౌరస్తా,పెద్ద మసీదు,అమర్‌నగర్ చౌరస్తా మీదుగా అయ్యప్ప టెంపుల్ వరకు సాగింది.ఈ సందర్భంగా దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని,జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని,నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.మెగా డీఎస్సీ,యూత్ కమిషన్ ఏర్పాటు,యువతకు వడ్డీలేని రుణాలు,విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి అమలును విస్మరించిందని ఆరోపించారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు,భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థుల చదువులకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్,విద్యా భరోసా,అవసరమైన ఆర్థిక సహాయం వంటి హామీలను కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు.విద్యార్థులు,యువత సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని,ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో విద్య,ఉద్యోగ, ఉపాధి రంగాల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు.కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు హైదరాబాద్‌ను ఐటీ,పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమై విద్యార్థులు,నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని విమర్శించారు.యువత హక్కులు,భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేసే వరకు ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని దాసరి మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,విద్యార్థి యువజన నాయకులు,కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు,యువకులు పాల్గొన్నారు.

## 600 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 5(ప్రజా కలం): మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన బ్యాగులు, నోట్‌బుక్స్, నోట్‌ఫైల్స్, బూట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సౌకర్యాల కోసం అధికంగా నిధులు కేటాయిస్తోందని తెలిపారు. కళాశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు వెల్లడించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల ద్వారా నాణ్యమైన విద్య అందుతోందని పేర్కొన్నారు.మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులు తెలిపిన సమస్యలను మున్సిపల్ తరఫున త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు.అనంతరం కళాశాల ఆవరణలో జరుగుతున్న నూతన నిర్మాణ పనులను వారు పరిశీలించారు.అనంతరం కళాశాల అధ్యాపకులు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, , కౌన్సిలర్లు నునుగొండ నరేశ్, గుడికందుల అజయ్, పందిరి రమేష్, కాజాఅజీముద్దీన్,మైలారపు రాంబాబు, ముఖీం, పిప్పర రాజేశ్, జెట్టి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల కోసం ఉద్యమిద్దాం

### - టీజీఈ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్

### - సెప్టెంబర్ 10 ఛలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలి



పెద్దపల్లి,సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లు,కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి మహాధర్నా ఛలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని టీజీఈ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ పిలుపునిచ్చారు.మహాధర్నా విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై టీజీఈ జేఏసీ పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని 329వ గదిలో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలు,ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్,కార్మిక సంఘాల ప్రతినిధులతో మహాధర్నాకు భారీగా ఉద్యోగులను సమీకరించే అంశంపై చర్చించారు.శాఖలు,సంఘాల వారీగా ఉద్యోగుల సమీకరణతో పాటు హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు బస్సుల ఏర్పాటు,మండలాల వారీగా బాధ్యతల కేటాయింపు,విస్తృత ప్రచారం,సమన్వయ కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై కార్యాచరణ రూపొందించారు.ప్రతి శాఖలో ఉద్యోగులకు మహాధర్నా లక్ష్యాలను వివరించి పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.అదేవిధంగా సెప్టెంబర్ 8న కరీంనగర్‌లో టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి రాష్ట్ర జేఏసీ నాయకులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం టీజీఈ జేఏసీ జిల్లా నాయకుల సమక్షంలో ఛలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 10న పెద్దపల్లి జిల్లా నుంచి వేలాది మంది ఉద్యోగులు హైదరాబాద్‌కు తరలివెళ్లేలా ప్రతి శాఖలో విస్తృత ప్రచారం చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా టీజీఈ జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్,తోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ పెండింగ్ వేతన సవరణ సంఘం సమస్య పరిష్కారం,కరువు భత్యం బకాయిల చెల్లింపు,పాత పింఛను విధానం అమలు,పెండింగ్ బిల్లుల చెల్లింపు,ఆరోగ్య కార్డుల సమర్థవంతమైన అమలు, పదోన్నతులు,బదిలీలు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమంలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని,హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీజేఏసీ కన్వీనర్ తూము రవీందర్,టీజీఓ కార్యదర్శి సురేష్,యూటీఎఫ్ లక్ష్మణ్,టీపీటీఎఫ్ పోచయ్య,టీఎస్పీఆర్టీయూ చల్లటి శ్రీనివాస్,కిషన్,
రాష్ట్ర కార్యదర్శి కండి సారయ్య,టీఎన్జీఓ సంఘం నాయకులు కొమరయ్య,అనిత, ఆడెపు శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి,శ్రీనివాస్‌గౌడ్,శ్రీధర్,ప్రవీణ్, సౌమ్య,శిల్ప,నూకల శంకర్,పవన్,ప్రేమ్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

### ఉప ముఖ్యమంత్రి ధర్మపురి పర్యటనను

## విజయవంతం చేయండి..

### - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

వెల్గటూర్, సెప్టెంబర్ 5, ప్రజాకలం, ప్రతినిధి :తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటనను నియోజక వర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు.. సెప్టెంబర్ 6, ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్ నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి రాత్రి 7.30 కు ధర్మపురి పట్టణానికి చేరుకుంటారని తెలిపారు. అదేరోజు ధర్మపురిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి గార్డెన్స్ లో నిర్వహించే సమావేశానికి ఉప ముఖ్యమంత్రి హాజరు కానున్నట్లు వివరించారు. ఆదివారం రాత్రి అక్కడే టధర్మపురి)లో బస చేసి సోమవారం తెల్లవారు జామున 2.30 కు ధర్మపురిలో రూ. 10కోట్ల నిధులతో ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులను భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్‌నిర్మాణ పూజ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత అదేరోజు ఉదయం5,30 కు తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళ్ళానున్నట్లు వివరించారు.

## విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### – మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ధర్నా



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాకలం) విద్యార్థులు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డా. సంజయ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల సమయంలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపడతామని, విద్యార్థులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం




అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఎమ్మెల్యే విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే జిఓ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మొండివైఖరి వీడి, వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదని ఆరోపించారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో శ్రమదానం



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాకలం) పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం హిందూ శ్మశానవాటికలో శ్రమదానం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, వార్డు కౌన్సిలర్ బొడ్ల ఆనంద్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది శ్మశానవాటికలో పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. వర్షాల కారణంగా శ్మశానవాటికలో గడ్డి, పిచ్చి మొక్కలు అధికంగా పెరిగాయని తెలిపారు.మున్సిపల్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్‌తో కలిసి వాటిని తొలగించి శ్మశానవాటికను పరిశుభ్రంగా,సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.పట్టణంలోని అన్ని శ్మశానవాటికల్లోనూ శ్రమదానం చేపట్టి పరిశుభ్రతను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మపురి వేణుగోపాల్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో రెబ్బాస్ మహేష్

### - వినాయక ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

### - హైవేపై చెట్ల కొమ్మల తొలగింపు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజా కలం) పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వార్డులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో భక్తులు, ఉత్సవ నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హైవేపై రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు



చేపట్టారు. దీంతో వినాయక విగ్రహాల తరలింపు, ఊరేగింపులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా మార్గం సుగమమైంది.ప్రజల అవసరాలను గుర్తించి ముందుగానే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్‌ను స్థానికులు అభినందిస్తున్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

ప్రజా కలం
ఆదివారం, సెప్టెంబర్ 6, 2026

# డిజిటల్ మాధ్యమంపై నియంత్రణకు వేళాయె!

సమాచార విప్లవం మానవ జీవితాన్ని వేగవంతం చేసింది. చేతిలోని చిన్న పరికరం ప్రపంచాన్ని మన గదిలోకి తీసుకొచ్చింది. జ్ఞానం, విద్య, ఉపాధి, వినోదం, వ్యాపారం, ప్రజాసేవ–ప్రతి రంగంలోనూ డిజిటల్ మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఇదే సాంకేతికత అదుపుతప్పితే సమాజానికి వరంగా కాకుండా శాపంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో హింస, అసభ్యత, విద్వేషం, తప్పుడు సమాచారం, వ్యక్తిత్వ హననం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ కంటెంట్‌పై సమర్థమైన నియంత్రణ అత్యవసరంగా మారింది. సామాజిక మాధ్యమంలో ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్య క్షణాల్లో లక్షల మందికి చేరుతుంది. ఒక తప్పుడు వార్త సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. ఒక రెచ్చగొట్టే వీడియో యువతలో హింసాత్మక ఆలోచనలను ప్రేరేపించవచ్చు. ఒక అసభ్య దృశ్యం పిల్లల మానసిక వికాసంపై ప్రభావం చూపవచ్చు. ఒక వ్యక్తిపై నిరాధార ఆరోపణ అతని ప్రతిష్ఠను మాత్రమే కాదు, కుటుంబ జీవితాన్నీ దెబ్బతీయవచ్చు. మరీ ముఖ్యంగా, నేరాలను చిత్రీకరించి వాటిని వినోదంగా చూపించడం, హింసను గొప్పతనంగా ప్రచారం చేయడం ప్రమాదకరమైన సామాజిక ప్రభావాలను కలిగించే అవకాశం ఉంది. ఇక్కడ ప్రశ్న భావప్రకటన స్వేచ్ఛను అణచివేయాలా? అన్నది కాదు. ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు, ప్రశ్నించే హక్కు, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు అత్యంత విలువైనవి. కానీ స్వేచ్ఛకు బాధ్యత కూడా తోడవ్వాలి. మరొకరి హక్కులను హరించే, హింసకు ప్రేరేపించే, విద్వేషాన్ని రెచ్చగొట్టే, పిల్లలను లక్ష్యంగా చేసుకునే లేదా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే కంటెంట్‌ను స్వేచ్ఛ పేరుతో సమర్థించడం సమంజసం కాదు. అందువల్ల 'సెన్సార్‌షిప్' అనే పదాన్ని విస్తృతమైన అణచివేతగా కాకుండా బాధ్యతాయుతమైన డిజిటల్ నియంత్రణగా చూడాలి. ప్రతి వేదికలో కంటెంట్ పర్యవేక్షణ వ్యవస్థలు బలోపేతం కావాలి. హింస, బాలలపై దుష్ప్రభావం చూపే అసభ్య కంటెంట్, విద్వేష ప్రసంగాలు, నేరాలను ప్రేరేపించే సందేశాలు, తప్పుడు వార్తలు వేగంగా గుర్తించి తొలగించే విధానం ఉండాలి. ఫిర్యాదుల పరిష్కారానికి సమయపరిమితి, పారదర్శకత, అప్పీల్ అవకాశం తప్పనిసరి చేయాలి. అంతేకాదు, కృత్రిమ మేధస్సుతో తయారయ్యే నకిలీ దృశ్యాలు, మార్ఫింగ్ చిత్రాలు, నకిలీ స్వరాలు మరింత పెద్ద సవాలుగా మారుతున్నాయి. నిజమైన వ్యక్తి మాట్లాడనిది మాట్లాడినట్లు చూపించే సాంకేతికతను దుర్వినియోగం చేస్తే వ్యక్తిగత ప్రతిష్ఠతో పాటు సామాజిక శాంతికీ ముప్పు ఏర్పడుతుంది. అలాంటి కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, మూలాన్ని తెలుసుకునే అవకాశం, వేగవంతమైన తొలగింపు విధానం అవసరం. పిల్లల విషయంలో మరింత కఠిన ప్రమాణాలు అవసరం. వయస్సు నిర్ధారణ, తల్లిదండ్రుల నియంత్రణలు, హానికర కంటెంట్ నిరోధం, పాఠశాల స్థాయిలో డిజిటల్ అవగాహన వంటి చర్యలను విస్తరించాలి. అదే సమయంలో సామాజిక మాధ్యమ సంస్థలు కేవలం లాభాల కోసం పనిచేసే వ్యాపార సంస్థలుగా కాకుండా సమాజంపై ప్రభావం చూపే బాధ్యతాయుత వేదికలుగా వ్యవహరించాలి. ప్రభుత్వం కూడా నియంత్రణ పేరుతో విచక్షణారహితంగా కంటెంట్‌ను తొలగించే అధికారం పొందకూడదు. స్వతంత్ర పర్యవేక్షణ, స్పష్టమైన చట్టాలు, న్యాయపరమైన సమీక్ష, పారదర్శక విధానాలు ఉండాలి. లేకపోతే హానికర కంటెంట్‌ను అరికట్టే ప్రయత్నం భావప్రకటన స్వేచ్ఛను పరిమితం చేసే సాధనంగా మారే ప్రమాదం ఉంది. డిజిటల్ ప్రపంచం మన జీవితాల్లో అంతర్భాగమైపోయింది. దాన్ని మూసివేయడం పరిష్కారం కాదు; దాన్ని బాధ్యతాయుతంగా నడిపించడం పరిష్కారం. సాంకేతిక స్వేచ్ఛకు సామాజిక బాధ్యతను జోడించినప్పుడే డిజిటల్ మాధ్యమం ప్రజాస్వామ్యానికి బలం అవుతుంది. హింసను రెచ్చగొట్టే చేతులకు వేదిక కాకుండా, జ్ఞానాన్ని పంచే వేదికగా సామాజిక మాధ్యమాన్ని తీర్చిదిద్దాల్సిన సమయం ఆసన్నమైంది.

**సి.హెచ్.ప్రతాప్**

# నిజామాబాద్ ప్రజలకు కృతజ్ఞతలు

## కొత్త నాయకత్వానికి టీఆర్ఎస్ వేదిక - బహుజన తెలంగాణ సాధనలో నిజామాబాద్ ముందుండాలి - డాక్టర్ రఘు

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 5(ప్రజాకలం) పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేసిన నిజామాబాద్ జిల్లా ప్రజలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, సభ పర్యవేక్షకులు డాక్టర్. రఘు తెలిపారు. తాము ఊహించిన దానికంటే సభకు విశేష స్పందన లభించిందని, జిల్లా నలు మూలల నుంచి ప్రజలు, యువత, మహిళలు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని పేర్కొన్నారు. సభ విజయవంతానికి జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు చేసిన కృషిని ఆయన అభినందించారు. సభ నిర్వహణలో సహకరించిన మీడియా ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, అధికారులు, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు సభ పర్యవేక్షకుడిగా బాధ్యత అప్పగించిన కవితమ్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్‌తో కవితమ్మకు ఎన్నో ఏళ్లుగా ప్రత్యేక అనుబంధం ఉందని, చాలా రోజుల తర్వాత ఆమె ప్రజల మధ్యకు వచ్చిన సందర్భంలో ఆ బంధం సభలో స్పష్టంగా కనిపించిందన్నారు. ఆమె భావోద్వేగానికి గురైన సమయంలో ప్రజలు కూడా అదే అభిమానంతో స్పందించారని తెలిపారు. రాజకీయ పరిస్థితులు, కాలం మారినా కవితమ్మకు నిజామాబాద్ ప్రజలతో ఉన్న అనుబంధం మారలేదని సభ మరోసారి నిరూపించిందన్నారు.



పార్టీ ఏర్పాటు తర్వాత నిజామాబాద్‌లో నిర్వహించిన ఈ సభకు లభించిన స్పందన టీఆర్ఎస్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, అదే సమయంలో తమ బాధ్యతను కూడా పెంచిందని డా. రఘు అన్నారు. పాంచజన్యం అంటే కేవలం సభ పేరు కాదని, విద్య, వైద్యం, యువతకు అవకాశాలు, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం అనే ఐదు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణ అని ఆయన వివరించారు. ఈ అంశాలపై గ్రామస్థాయి నుంచి ప్రజలతో చర్చించి, పాంచజన్య సంకల్పాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. కవితమ్మ పేర్కొన్నట్లుగా టీఆర్ఎస్ కొత్త నాయకత్వానికి వేదికగా నిలుస్తుందని రఘు తెలిపారు. రాజకీయాల్లోకి రావాలనుకునే సామాన్య కుటుంబాల యువతకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలు సహా అన్ని వర్గాల నుంచి కొత్త నాయకత్వం రావాలని, ప్రజల కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే వారికి రాజకీయంగా ఎదిగే అవకాశం కల్పించాలన్నారు. తెలంగాణ సాధించిన తర్వాత కూడా సామాజిక న్యాయం విషయంలో ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని, బహుజన తెలంగాణ సాధన కోసం టీఆర్ఎస్ పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో నిజామాబాద్ ప్రజలు ముందుండి పోరాడినట్టే, బహుజన తెలంగాణ, సామాజిక న్యాయం కోసం జరిగే ప్రయాణంలోనూ నిజామాబాద్ ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. పాంచజన్య సంకల్ప సభ విజయవంతంతో కార్యక్రమాలు ఆగిపోవని, ఇప్పుడే అసలు పని ప్రారంభమవుతుందని డా. రఘు అన్నారు. పాంచజన్య ఐదు లక్ష్యాలను గ్రామ గ్రామానికీ తీసుకెళ్లి ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరోసారి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**ఇంటర్ విద్యపై తొందరపాటు నిర్ణయాలు వద్దు – డాక్టర్. రఘు**

ఇంటర్మీడియెట్ విద్యను పాఠశాల విద్య పరిధిలోకి తీసుకురావడం, సెకండరీ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియెట్ బోర్డులను విలీనం చేసి ఒకే బోర్డు ఏర్పాటు చేయాలన్న సిఫారసులపై ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రఘు అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల్లో ఉన్న సందేహాలను ముందుగా నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఒకే బోర్డు ఏర్పాటు చేయడం అంటే 10, 11, 12 తరగతులను తప్పనిసరిగా ఒకే పాఠశాలలో నిర్వహించడం కాదని పేర్కొన్నారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఒకే బోర్డు పరిధిలో ఉన్నప్పటికీ 11, 12 తరగతులకు ప్రత్యేక జూనియర్ కాలేజీలు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో మోడల్ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్య కొనసాగుతున్నప్పటికీ, ఆయా తరగతులు వేర్వేరు బోర్డుల పరిధిలో ఉన్నాయని గుర్తుచేశారు. కాబట్టి బోర్డుల విలీనం, ఇంటర్మీడియెట్ వ్యవస్థలో మార్పులు రెండూ వేర్వేరు అంశాలని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. విద్యా కమిషన్ సిఫారసులపై విద్యార్థి, అధ్యాపక సంఘాలు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అధ్యాపకుల సర్వీసు అంశాలు, జూనియర్ కాలేజీల భవిష్యత్తు, పరిపాలనా వ్యవస్థపై ప్రభావం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు తాము వ్యతిరేకం కాదని, అయితే చర్చ లేకుండా, స్పష్టత లేకుండా తీసుకునే నిర్ణయాలు విద్యారంగంలో గందరగోళానికి దారితీయకూడదని రఘు పేర్కొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

## –రైతు విజ్ఞాన కేంద్ర కో–ఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ భాస్కర్ సూచన



ఎండపల్లి, సెప్టెంబర్ 05 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని పడ్కల్ గ్రామం లో ప్రకృతి వ్యవ సాయంపై రైతు అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి తక్కువ ఖర్చు తో అధిక దిగుబడి సాధించే పద్ధతుల గురించి రైతులకు వివరించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్ర కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ విజయ్ భాస్కర్ నేటి కాలం లో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, నేల ఆరోగ్య పరిరక్షణ, జీవన ఎరువుల వాడకం గురించి వివరంగా తెలియజేశారు. విత్తన ధృవీకరణ అధికారి నాగరాజు విత్తన ధృవీకరణ ప్రక్రియ, నాణ్యమైన విత్తనాల ఎంపిక ప్రాధా న్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎండపల్లి మండలంలోని పడకల్, కొత్తపేట, రాజారాంపల్లి మొదలగు గ్రామల లో వరి, పత్తి, పసుపు పొలాలను క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్ర, కో–ఆర్డినేటర్ మరియు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ విజయ్ భాస్కర్ రైతులకు ఆయా పంటల లో అనుసరించాల్సిన సాగు యాజమాన్య పద్ధతులు పై అవగాహన కల్పించారు. వరి పొలం లో కాలి బాటలు తీయడం ద్వారా చీడపీడల నియంత్రణ సాధ్యమవు తుందని వివరించడం జరిగింది. కాండం తొలుచు పురుగు నివారణకు 2 గ్రాముల కాట్రాపూ హైడ్రో క్లోరైడ్ ఒక్క లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి గమ నించగా వాటి నివారణకు ఏసిఫేట్ 1.5 గ్రాముల క్లోరోపైరిఫాస్ 2.0 మీ. లీ మందు లను వేపనూనె 5 మి.లీ తో 1 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఎమోమెక్టిన్ బెంజోట్ 0.4 గ్రాము మందును 1 లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి లింగారసక బుట్టల ను 10 ఒక ఎకరా కు పెట్టాలని రైతులకు చెప్పారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారినీ కళ్యాడపు మౌనిక, గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

# రైతులపై బీఆర్ఎస్ నాయకుల మొసలి కన్నీరు

## – వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు




మల్లాపూర్, సెప్టెంబర్ 05 (ప్రజా కలం ప్రతినిధి):

రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ దేశంలోనే రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వంటి సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతుల సమస్యలు అనుకుంటూ బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఆందోళన వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని, గత ప్రభుత్వ హయాంలో రైతులకు జరిగిన నష్టాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు జువ్వాడి కృష్ణారావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎల్లల జలపతి రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ల సోమయ్య, పలు గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు నైతిక విలువలు తప్పనిసరి

## - నైతిక విలువల కూడిన విద్యతోనే సమాజ వికాసం
## - జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దాసరి కల్పన
## - ఘనంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 'ఫ్రెషర్స్ డే'

పెద్దపల్లి, సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

విద్యార్థులు కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా నైతిక విలువలు, సంస్కారంతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే సమాజంలో ఉన్నత పౌరులుగా రాణించగలరని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దాసరి కల్పన స్పష్టం చేశారు. పెద్దపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన నూతన విద్యార్థుల స్వాగత వేడుకల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ప్రిన్సిపల్ రామగిరి కేదారేశ్వర్ తో కలిసి జ్యోతి ప్రజ్వలనం చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి కల్పన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ అనేది అత్యంత కీలకమైన ఘట్టమని, భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని, వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత, సంస్కృతి, వినయం, విధేయత అనేవి విద్యార్థులకు నిజమైన ఆభరణాలు లాంటివని వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ బోధించిన సిద్ధాంతాలను గుర్తుచేస్తూ.. శ్రమ లేని సంపద, ప్రవర్తన లేని జ్ఞానం, మానవత్వం లేని సైన్స్, నైతికత లేని వ్యాపారం, సిద్ధాంతాలు లేని రాజకీయం సమాజానికి హానికరమని, అందుకే విద్యార్థులు మానవీయ విలువలతో కూడిన జ్ఞానాన్ని పొంది కళాశాలకు, కన్నతండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవం కూడా ఈ రోజే



కావడంతో, మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను, అభ్యుదయ భావాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థినులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువు ఉపాధ్యాయులకు, విద్యార్థినిలు శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామగిరి కేదారేశ్వర్, ఆధ్యాపకులు నరహరి, సంతోష్, అశోక్ కుమార్, అశ్వినీ, రమాదేవి, శ్రీలత, రాజమణి, నవ్య, పుష్పలత, రామకృష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సీఎం సభలో జగిత్యాల జిల్లా వాసికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాకలం)

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జగిత్యాల జిల్లా వాసి భూముల నరేష్ కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. సీఎం సభలో నిర్వహించిన టీచర్స్ డే కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యోగితా రాణి, ఎం.జె.పి. కార్యదర్శి బి. సైదులు చేతుల మీదుగా నరేష్ కుమార్ ఈ అవార్డును స్వీకరించారు. జగిత్యాల జిల్లాకు చెందిన వ్యక్తి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం పట్ల జిల్లా వాసులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ నరేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.




# కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు..



మల్లాపూర్, సెప్టెంబర్ 05 (ప్రజా కలం ప్రతినిధి)

కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లల జలపతి రెడ్డి జన్మదిన వేడుకలను మల్లాపూర్ మండల కేంద్రం లో కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య, వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు కృష్ణ రావు హాజరై జలపతి రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి రేగుంటలోని నివేదిత వృద్ధాశ్రమాన్ని జలపతి రెడ్డి సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులతో కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

**– ఈ నెల 9న పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఉద్యోగ మేళా**

**– జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్**

పెద్దపల్లి,సెప్టెంబర్ 05 (ప్రజాకలం జిల్లాప్రతినిధి) హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థ సుభగృహ (ప్రాజెక్ట్)-ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 09న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం మొదటి అంతస్తు,రూమ్ నంబర్ 233లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళా ద్వారా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్,మార్కెటింగ్ మేనేజర్స్, టెలికాలర్స్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఏదైనా డిగ్రీ,ఎంబీఏ లేదా బీటెక్ విద్యార్హత కలిగిన పురుష అభ్యర్థులు మార్కెటింగ్ పోస్టులకు అర్హులని,ఎంపికైన వారికి నెలకు రూ.15వేల నుండి రూ.18వేల వరకు వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తయిన మహిళా అభ్యర్థులు టెలికాలర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని,వీరికి నెలకు రూ.15వేల వేతనం ఇస్తామని వెల్లడించారు.ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 09న ఉదయం 10 గంటలకు తమ రెజ్యూమ్,విద్యా అర్హతల ధ్రువపత్రాల జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్ మరియు అనుభవ ధ్రువపత్రాలతో నేరుగా హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ,ఇతర వివరాల కోసం 8985336947, 8121262441 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## గురువులే విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులు

**– గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్**

**– గాయత్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**




పెద్దపల్లి:సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా అధ్యాపకులుగా మారి తరగతులను నిర్వహిస్తూ బోధనలోని అనుభూతిని పొందారు.అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించి, సత్కరించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగి,ప్రపంచం గర్వించదగిన మేధావిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు.ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ అత్యున్నత పదవిని అధిరోహించడం యావత్ భారతదేశంలోని ఉపాధ్యాయులందరికీ గర్వకారణమన్నారు.రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమని తెలిపారు.ఆయన ఆశయాలు, విలువలను విద్యార్థులు,అధ్యాపకులు ఆదర్శంగా తీసుకుని విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేష్,అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్సీ ఎల్. రమణ అభినందనలు



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజాకలం)

జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ (వర్తక సంఘం) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శాసనమండలి ఉపనేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణను ఆయన జగిత్యాల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ ఎల్. రమణకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ ఎల్. రమణ అభినందించి, వర్తకుల సమస్యల పరిష్కారానికి సంఘం చురుగ్గా పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్ కుమార్ ఎన్నికయ్యారు.

## పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు

గొల్లపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు లోత్తునూర్, వివిధ గ్రామలలోనీ పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న,విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారతీయ తత్వశాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి రాధాక్రిష్ణ అని ఎన్నో కీలక పదవులు నిర్వర్తించారని వారు దేశానికి చేసిన సేవలకు అత్యున్నత పురస్కార భారతరత్న పొందారన్నారు.దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, మానవతా విలువలను బోధిస్తూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు మరువలేని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్, ఉపసర్పంచ్ ఒరగంటి మల్లేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,కుమారస్వామి, ఉపాధ్యాయులు, జయశ్రీ,స్వప్న విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



# సాంకేతికతకు తగ్గట్టు బోధన సాగాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష -58 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రతిష్టాత్మక పురస్కారాలు**



పెద్దపల్లి,సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి,అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.40 సంవత్సరాల క్రితం ఉన్న విద్యా వ్యవస్థకు,నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన యుగంలోని విద్యా వ్యవస్థకు ఎంతో తేడా ఉందని అన్నారు.వ్యవస్థ చాలా వేగంగా మారుతున్న నేపథ్యంలో మనం కూడా అందుకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లాలో వ్యక్తులపై ఆధారపడకుండా,వ్యవస్థ ఆధారంగా పనిచేసేలా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఎవరైనా ఉన్నా,లేకపోయినా వ్యవస్థ బలంగా,సమర్థవంతంగా పనిచేసేలా విధానాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తాము ఎప్పుడూ కేవలం నంబర్లు,ర్యాంకుల కోసం ప్రయత్నించలేదని,ప్రక్రియను బలోపేతం చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు.ప్రక్రియ సక్రమంగా ఉంటే ఫలితాలు,ర్యాంకులు సహజంగానే వస్తాయని పేర్కొన్నారు.గత రెండున్నర సంవత్సరాలుగా జిల్లాలోని పలువురు ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారులు,ఉపాధ్యాయులతో నిరంతరం చర్చిస్తూ విద్యా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.అందరి సమిష్టి కృషి,సహకారంతో వ్యక్తులతో సంబంధం లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసే మంచి ఫలితాలు సాధించగలిగామని అన్నారు.గత రెండున్నర సంవత్సరాలుగా విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక అభినందనలు,కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో మంచి విలువలు,క్రమశిక్షణ,బాధ్యతాయుతమైన ప్రవర్తన పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు.అనంతరం ఉత్తమ సేవలు అందించిన 58 ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ శాలువాలు,పుష్పగుచ్ఛాలతో సన్మానించి,అవార్డులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద,అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.ఎం.షేక్, సెక్టోరియల్ అధికారి,మల్లేశం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 'నీట్' కొట్టిన తబిత ఆశ్రమ దీపం

**పట్టుదలతో డాక్టర్ సీటు సాధించిన అనాథ బాలిక సంధ్య - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి,సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) తబిత ఆశ్రమంలో చిన్ననాటి నుంచి ఉంటూ విద్యాభ్యాసం కొనసాగించిన అనాథ బాలిక వి.సంధ్య తన ప్రతిభ,పట్టుదలతో ఎంబీబీఎస్ సీటు సాధించి స్ఫూర్తిదాయకంగా నిలిచారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.పెద్దపల్లి జిల్లా తబిత ఆశ్రమంలో 1వ తరగతి నుంచి విద్యాభ్యాసం కొనసాగించిన వి.సంధ్య ఇంటర్మీడియట్‌లో 955 మార్కులు సాధించారు.వైద్య విద్యలో ప్రవేశం సాధించాలనే ఆమె లక్ష్యాన్ని నెరవేర్చేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.సంధ్యకు నీట్ ఆన్‌లైన్ కోచింగ్ అందేలా ఏర్పాట్లు చేసి,ఆమె చదువుకు అవసరమైన ప్రోత్సాహం,సహకారం అందించారు.తబిత ఆశ్రమంలోనే ఉంటూ ఆన్‌లైన్ ద్వారా నీట్ కోచింగ్ తీసుకున్న సంధ్య పట్టుదలతో చదివి,మంచి ప్రతిభ కనబరిచి భూపాలపల్లి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు.తనకు అందించిన సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆశించిన లక్ష్యాన్ని సాధించిన సంధ్యను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.చిన్ననాటి నుంచి ఆశ్రమ సంరక్షణలో పెరిగి,విద్యపై దృష్టి సారించి వైద్య విద్యలో సీటు సాధించడం అభినందనీయమని తెలిపారు.సంధ్య సాధించిన విజయం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.ఆమె ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసే వరకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు.విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.తబిత ఆశ్రమంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్న ఇతర బాలబాలికలు కూడా సంధ్యను స్ఫూర్తిగా తీసుకుని విద్యలో రాణించాలని సూచించారు.వారి విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.సంధ్య సాధించిన విజయం తబిత ఆశ్రమంలోని ఇతర బాలబాలికలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.సరైన ప్రోత్సాహం,మార్గదర్శకత్వం అందిస్తే ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు)లో

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 5, (ప్రజా కలం) ప్రతినిధి భారత దేశం గర్వించే గొప్ప తత్వవేత్త, ప్రఖ్యాత విద్యావేత్త ,రెండవ రాష్ట్రపతిగా ఖ్యాతిగాంచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో "సెల్ఫ్ గవర్నమెంట్ డే" నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రధాన భూమికను నిర్వహించారు తరగతులను బోధించడం, విధ్యా పరిపాలన బాధ్యతలు నిర్వహించడం ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇది విద్యార్థులలో నాయకత్వ నైపుణ్యాలు,నిర్ణయ సామర్థ్యం మరియు బాధ్యతాయుత మనస్తత్వం పెంపొందించడానికి ఒక గొప్ప వేదికగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం జరిగింది .విద్యార్థులు తమకు జ్ఞానాన్ని అందించే గురువులను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, కృతజ్ఞతతో సన్మానించడం అభినందనీయం. ఉపాధ్యాయులు విద్యార్థుల జీవిత నిర్మాణంలో చేసే త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటు,వారిపై గౌరవాన్ని వ్యక్తం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ శంఅజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు చీనా ప్రోగ్రాం ఆఫీసర్ సోమయ్య, గురుపాదం కరుణాకర్, చంద్రయ్య ,లక్ష్మణ్ ,తిరుమల దేవి ,విమల్ కుమార్, సత్య్య ,రాజేష్, డాక్టర్ ఉపేందర్, ప్రవళిక, ఓపి లక్ష్మణ్, నవీన్, నరేష్, జెబీ ప్రావణి, హబీబ్ అర్జున్, సురేష్ ,స్వరూప, శారద కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ పాల్గొన్నారు, ఉపాధ్యాయుల సేవలను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు.

# ఇంటి ముందు స్కూటీ చోరీ.. లారీ డ్రైవర్ అరెస్ట్

**- చోరీకి గురైన వాహనం స్వాధీనం**



పెద్దపల్లి,సెప్టెంబర్ 05:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని చోరీ చేసిన కేసులో ఓ వ్యక్తిని పెద్దపల్లి పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి,చోరీకి గురైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లి పట్టణ ఎస్సై కే.నరేష్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఆదర్శనగర్‌కు చెందిన మోంగాని సతీష్ (50) సెప్టెంబర్ 1న రాత్రి తన స్కూటీని ఇంటి ముందు పార్క్ చేయగా,మరుసటి రోజు ఉదయం వాహనం కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు.దీంతో గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీని అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో శనివారం ఎస్సై కే.నరేష్ సిబ్బందితో కలిసి పెద్దపల్లి పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, బస్‌స్టాండ్ సమీపంలో చోరీకి గురైన స్కూటీపై వెళ్తున్న ఓ వ్యక్తిని అనుమానించి అదుపులోకి తీసుకున్నారు.విచారణలో అతడిని పెద్దపల్లి సాగర్ రోడ్డుకు చెందిన లారీ డ్రైవర్ ఎండీ.ఇంతియాజ్ (31)గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే స్కూటీని చోరీ చేసినట్లు విచారణలో నిందితుడు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.అలాగే ఇంతియాజ్‌పై గతంలో 2019లో పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదైనట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై కే.నరేష్ తెలిపారు.

## జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సన్మానం



ఎండపల్లి, సెప్టెంబర్ 05 : (ప్రజాకలం (ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో శనివారం రోజున జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు తమకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయుల సమక్షం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి మాట్లాడుతూ గురువుల గొప్పతనం గురించి విద్యార్థుల జీవి తాలను ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పాటలు, ప్రసంగాలతో ఆకట్టు కున్నారు. పాఠశాల ఆవరణ లో వేడుకలు సందడిగా సాగాయి. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి, ఎస్ రమాదేవి, వి ప్రశాంత్, కే కృష్ణారెడ్డి, ఎన్ నరేష్ కుమార్, ఎన్ శ్రీలత, శిరీష, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది..

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**ధర్మపురిలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో భారీ ర్యాలీ**




వెల్గటూర్, సెప్టెంబర్5, ప్రజాకలం, ప్రతినిధి :

కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసి 'యంగ్ ఇండియా మోడల్ స్కూల్, పేరుతో కాలయాపన చేస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా, ధర్మపురి మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ లో రెండు వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడి లక్ష 25 వేల అడ్మిషన్లు తగ్గాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగా లు ఇస్తామన్న హామీని నెరవేర్చకపోగా, కేసీఆర్ హయాంలో ఇచ్చిన 50 వేల ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకుని 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నా రని ఎద్దేవా చేశారు. టెన్త్ పాస్ అయితే రూ. 5 వేలు, ఇంటర్ పాస్ అయితే రూ.20 వేలు, డిగ్రీ పాస్ అయితే రూ.1 లక్ష, పీజీ పాస్ అయితే రూ.2 లక్షలు, పిహెచ్‌డి పాస్ అయితే రూ.5 లక్షలు, 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు 'స్కూటీ' ను పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు . సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కొనుగోళ్లలో (షూస్, బెల్టులు, బ్యాగులు) స్థానిక ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లను పక్కనపెట్టి, గుజరాత్ రాష్ట్రానికి సంబంధించిన కాంట్రాక్టర్లకు కట్టబెట్టి అక్రమాలకు పాల్పడు తున్నారని ఆరోపించారు. మహిళలకు అందజేస్తున్న ఉచిత బస్సు ప్రయాణాన్ని సరిగ్గా నిర్వహించకుండా, బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి గ్రామాల్లో బస్సులను ఆపకుండా ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో 7.50 లక్షల కొత్త రేషన్ కార్డులను అందజేసి, ఉచిత బియ్యం అందజేశామని, ప్రస్తుతం స్మార్ట్ కార్డుల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో రోజుకు 6 నుంచి 8 గంటల పాటు (రాత్రి వేళల్లో) విద్యుత్ కోతలు విధించడా న్ని ప్రశ్నించారు.గతంలో కేటీఆర్ ధర్మపురి అభివృద్ధికి మంజూరు చేసిన రూ.25 కోట్ల నిధులను రద్దు చేశారని, 6వేల ఎకరాలకు నీరందించే అక్కపెల్లి ప్రాజెక్టు పనులతో పాటు కమలాపూర్, గోదావరి రోడ్ల నిర్మాణాన్ని నిలిపి వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గోదావరి ప్రక్షాళనకు మంజూరు చేసిన రూ.25 కోట్లను కాంగ్రెస్ నాయకులు కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబ ర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి, 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్'కు రావాల్సిన రూ.300 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు.నర్సింగ్ చదివే విద్యార్థులకు అందజేసే స్కాలర్‌షిప్‌ల రద్దు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసిన ఎస్సై

**-23,580 రూపాయలు, 6 సెల్ ఫోన్ లు, 2 బైకులు, స్వాధీనం**




ధర్మారం, సెప్టెంబర్ 05 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని మేడారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారు అనే పక్కా సమాచారం మేరకు మేడారం గ్రామ శివారులో గల ఒక మామిడితోట లో పేకాట ఆడుతున్న ధర్మారం మండలానికి చెందిన వివిధ గ్రామాల వారు అయినా కొంగల శ్రీనివాస్, సామంతుల నర్సయ్య, తిరుపతి, సుంకపాక దేవదాస్, దామెర స్వామి, ఎస్ వెంకటేష్ అను వారిని పట్టుకుని వారి నుండి 23,580/- రూపాయలు, 6 సెల్ ఫోన్ లు, 2 బైక్ లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

# కూడా చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపిన ఇ.వి.శ్రీనివాస్ రావు

హనుమకొండ సెప్టెంబర్ 5 ప్రజా కలం ప్రతినిధి : కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్



అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి ప్రభాకర్ ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి.శ్రీనివాస్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కుడా పరిధిలో పట్టణాభివృద్ధి,మౌలిక వసతుల కల్పన,ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా గుండు సుధారాణి నాయకత్వంలో కుడా మరింత అభివృద్ధి సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జెడ్ పి హెచ్ ఎస్ పర్వతగిరి పాఠశాలలో భక్తి భావంతో గురుపూజోత్సవం




(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 05, ప్రజాకలం ప్రతినిధి.

మండల కేంద్రశిలోని జెడ్ పి హెచ్ ఎస్ పర్వతగిరి ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ చీదురు శంకర్ విచ్చేసి ఉపాధ్యాయులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావిభారత ఉత్తమ పౌరులను రూపుదిద్దే ఉపాధ్యాయులను సమాజం భగవత్ స్వరూపులుగా పరిగణించి గౌరవించాలని అన్నారు. సభాధ్యక్షులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి నవీన్ కుమార్ మాట్లాడుతూ, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినశీ పురస్కరించుకొని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు నిరంతరం నిస్వార్థంతో శ్రమిస్తున్న ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు నడవాలని సూచించారు. సీనియర్ ఉపాధ్యాయులు పాక రమేష్ బాబు మాట్లాడుతూ, ఈనాటి ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు లాంటి సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ ఉపాధ్యాయుడు ప్రత్యక్ష బోధనకు సాటి రాదని, గురు శిష్యుల మధ్య సంబంధం భగవంతునికి భక్తునికి మధ్య లాగా ఉండాలని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, శాంతి కిరణ్, మీ పరుశురాములు, అశోక్, డాక్టర్ మడత భాస్కర్, మనోహర్, అనిల్ కుమార్, తిరుపతి, తిరుమల, రాధాకృష్ణకుమారి, బి. రేఖ, ఎస్ . వెంకన్న, మౌనిక, ఐ. రమేష్, డాక్టర్ ఎం రాజలక్ష్మి, జి. ప్రశాంత్, శ్వేత పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అద్యంతం గురు భక్తి తో ఘనంగా నిర్వహించారు.

# పర్వతగిరిలో విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు

**- మూడు రోజులుగా సాయంత్రం 7 గంటలకే కరెంట్ కట్**

**- 30-40 నిమిషాల పాటు సరఫరా నిలిపివేత**

**- ఉదయం నుంచి తెల్లవారుజాము వరకు ఎన్నిసార్లు కరెంట్ పోతుందో గ్రామ ప్రజలకే తెలుసు!**



(వరంగల్/పర్వతగిరి) సెప్టెంబర్ 05, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత మూడు రోజులుగా ప్రతిరోజూ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో 30 నుంచి 40 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అంతటితో సమస్య ముగియడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచి తెల్లవారుజాము 6 గంటల వరకు ఎన్నిసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందో లెక్కపెట్టడం కూడా కష్టంగా మారిందని అంటున్నారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గృహ అవసరాలతో పాటు చిన్న వ్యాపారాలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ కోతలపై అధికారులను ప్రశ్నిస్తే ఒక్కోసారి ఒక్కో రకమైన సమాధానం ఇస్తున్నారని, అసలు కారణం ఏమిటో స్పష్టంగా చెప్పడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు పొంతనలేని సమాధానాలతో తప్పించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు సాంకేతిక సమస్య ఏమిటి? నిర్వహణ పనులా? లేక అనధికారిక విద్యుత్ కోతలా? అనే ప్రశ్నలు గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పర్వతగిరిలో గత మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ అంతరాయాలపై పూర్తి వివరాలు వెల్లడించి, తరచూ విద్యుత్ నిలిచిపోవడానికి గల కారణాలను ప్రజలకు స్పష్టం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే విద్యుత్ సరఫరా అంతరాయాలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# విస్డం హైస్కూల్ డైరెక్టర్‌కు ఘన సన్మానం

**- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గొలుసుల సుధాకర్**

(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 05, ప్రజాకలం ప్రతినిధి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు శనివారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. వరంగల్‌లోని ఆకుతోట ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని విస్డం హైస్కూల్ డైరెక్టర్ గొలుసుల సుధాకర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. కలెక్టర్ సత్య శారదా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, 'కుడ' చైర్మన్ గుండు సుధారాణి, పలువురు జిల్లా అధికారులు సుధాకర్‌కు మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడిగా అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించడం పట్ల వరంగల్ జిల్లా ట్రస్మా అధ్యక్షులు నాగార్జున రెడ్డి, కార్యవర్గం, పాఠశాల ప్రిన్సిపల్ అనుమాండ్ల దేవేందర్, డైరెక్టర్ వదగం శ్రీనివాస్, సుధాకర్‌కు అభినందనలు తెలిపారు.

# సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే




(వరంగల్/ పర్వతగిరి) సెప్టెంబర్ 05, ప్రజాకలం ప్రతినిధి

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే అని పర్వతగిరి మండల అభివృద్ధి అధికారి ఎం. శంకర్ నాయక్, పర్వతగిరి మండల తహశీల్దార్ టి. వెంకటస్వామి అన్నారు. పర్వతగిరి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరం నందు నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు.

ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా ఏనుగల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జి. లింగారెడ్డి, పర్వతగిరి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కే. నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందించిన వారిని గుర్తించి పూలదండ, శాలువా, ప్రశంసా పత్రంతో సత్కరించారు. సత్కారం పొందిన వారిలో గెజిటెడ్ ఉపాధ్యాయుల కేటగిరిలో జి. లింగారెడ్డి జడ్.పి.హెచ్.ఎస్ ఏనుగల్, స్కూల్ అసిస్టెంట్ క్యాటగిరిలో ఎస్. పురుషోత్తమరావు, ఎస్ ఏ సోషల్ జడ్.పి.హెచ్.ఎస్ గోపనపల్లి ఏ. కళ్యాణి, ఎస్ఎ సోషల్ జడ్పీహెచ్ఎస్ చింత నెక్కొండ ఎండి ఆఫీస్, ఎస్ ఎ ఇంగ్లీష్ జడ్పీహెచ్ఎస్ కొంకపాక వి. కేశవులు, ఎస్ఏ సోషల్ జడ్.పి.హెచ్.ఎస్ ఏనుగల్ ఎం. రాజ్యలక్ష్మి, ఎస్ ఏ హిందీ జెడ్పిహెచ్ఎస్ పర్వతగిరి పిఎస్ హెచ్ఎం క్యాటగిరిలో టి. శేషమ్మ, పి ఎస్ ఎంపిపిఎస్ గోపనపల్లి బి. శ్రీధర్, ఎంపిపిఎస్ ఇస్లావత్ తండా ఎస్ జి టి క్యాటగిరిలో ఎస్. శ్రీధర్, యుపిఎస్ దౌలత్ నగర్ ఎస్. ఉపేంద్ర, పీఎస్ లాలు తండా బి. నవీన్, పీఎస్ పర్వతగిరి డి. కిషోర్, పీఎస్ చౌటపల్లి టి. వేణు, పిఎస్ పెద్ద తండా జి. కిషన్, పీఎస్ పర్వతగిరి డి. రజనీ దేవి, ఎంపియుపిఎస్ బూరుగుమల్ల పి. శిరీష, పీఎస్ వడ్లకొండ పీ ఈ టీ క్యాటగిరిలో బి. సురేష్, మోడల్ స్కూల్ పర్వతగిరి నాన్ గవర్నమెంట్ మేనేజ్మెంట్ క్యాటగిరిలో ఎస్. స్వాతి, టిజిటి ఫిజిక్స్ సోషల్ వెల్ఫేర్ పర్వతగిరి కే. వరలక్ష్మి, టీజీటీ ఇంగ్లీష్ ట్రైబల్ వెల్ఫేర్ సోమారం బి. దేవేందర్, సీఆర్టీ తెలుగు బాయ్స్ ఆశ్రమ పాఠశాల పర్వతగిరి ఏ. రాణి, సిఆర్టి హిందీ కేజీబీవీ పర్వతగిరి కే. శ్రీనివాస్, హెచ్ ఎం ఆర్డీఎఫ్ కల్లెడ తదితరులు ఉన్నారు.

# మరిపెడలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ

**- వెయ్యి రోజుల ప్రజా పాలన మహోత్సవర్యాలీలో పాల్గొన్న డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్**



మరిపెడ ప్రతినిధి ప్రజాకలం న్యూస్, సెప్టెంబర్ 5

వెయ్యి రోజుల ప్రజా పాలనను పురస్కరించుకుని మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పాల్గొన్నారు. వారి వెంట పిసిసి కోఆర్డినేటర్ హావేజ్ ఖాన్ మండల అధ్యక్షులు గుగులోత్ రవి మున్సిపాలిటీ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక పిలుపు మేరకు వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలకు నాయకులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. రైతులు, పేదలు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అన్ని మతాలను, అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తూ, హిందూ పండుగలు, సంప్రదాయాలు, ఆలయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వెయ్యి రోజులు కేవలం ఒక మైలురాయి కాదు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన ప్రజా పాలనకు నిదర్శనం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వం మాపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మొద్దు అన్నారు ఈ కార్యక్రమంలో పీసీసీ కోఆర్డినేటర్ హవేజ్ ఖాన్, మరిపెడ మండల అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు రామ్ లాల్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ నాయక్, మైనార్టీ సెల్ నాయకులు తాజుద్దీన్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీలిపల్లి అభివృద్ధికి సర్పంచ్ ప్రత్యేక చొరవ

**- ఎమ్మెల్యే సహకారంతో సమస్యలకు పరిష్కారం**

గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజా కలం)

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి గ్రామంలో సర్పంచ్ డీకే శ్రీదేవి, కే. ఆంజనేయులు గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో, గ్రామ పెద్దలు మరియు ప్రజల భాగస్వామ్యంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు సుమారు 60 మీటర్ల మేర డ్రైనేజీ ఏర్పాటు చేసి, జేసీబీ సహాయంతో మురుగు, మట్టిని తొలగించి శుభ్రం చేయించారు. గతంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి పనులు చేపట్టారు. డ్రైనేజీ పనులకు సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. అదేవిధంగా స్మశానవాటికకు వెళ్లే రహదారిని వేయించారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో మట్టి పోయించి రహదారులను మెరుగుపరిచారు. గ్రామంలోని పాఠశాలకు అవసరమైన మరమ్మతులు చేయించారు. గతంలో గ్రామానికి



బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేశారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్న సర్పంచ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారం, గ్రామ పెద్దలు మరియు ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ తెలిపారు.

# గద్వాల విద్యకు కొత్త దిశ.. విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు





**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో 'స్ఫూర్తి' కార్యక్రమం ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, హైస్కూళ్లు, వసతి గృహాల్లో చదువుతున్న సుమారు 40 వేల మంది విద్యార్థులకు హెల్త్ కార్డులు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో 125 మంది విద్యా వాలంటీర్లను నియమించినట్లు వెల్లడించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం 'స్ఫూర్తి' కార్యక్రమం లోగో, పోస్టర్లను ఆవిష్కరించి, హెల్త్ కార్డులను విడుదల చేశారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఈఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి

# పదవీ బాధ్యతల స్వీకరణ

**- అట్టహాసంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం.. శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు**



హనుమకొండ సెప్టెంబర్ 5 ప్రజా కలం ప్రతినిధి

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి శనివారం హన్మకొండలోని కుడా కార్యాలయంలో అట్టహాసంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,కడియం శ్రీహరి,రేవూరి ప్రకాశ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు,అభిమానులు హాజరై గుండు సుధారాణికి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు, సిబ్బంది, వివిధ ప్రజాప్రతినిధులు,నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న గురువులకు ఘన సత్కారం



గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజా కలం:జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఉలిగేపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుమ్మరి లక్ష్మి, కుమ్మరి తిప్పన్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమ్మరి లక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి విలువలను విద్యార్థులకు అందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ప్రధానోపాధ్యాయులు శాంతన్న, ఉపాధ్యాయులు నాగరాజ్, అశ్విని, అంగన్‌వాడీ టీచర్లు శంకరమ్మ, లక్ష్మి, మాజీ సర్పంచ్ కె. చిన్న రాముడు, నాయకులు పోలీస్ తిమ్మప్ప, రఘు, వార్డు సభ్యులు సువర్ణ రవి, సబ్బు తిమ్మప్ప, మీ సేవ భీముడు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు

**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజా కలం:

గద్వాల పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల లెక్చరర్లను శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో క్రమశిక్షణగా




చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని కోరారు. గద్వాల ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, కళాశాల చైర్మన్ బీచుపల్లి, లెక్చరర్లు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొమ్ముగూడెంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ వాసం సుష్మిత

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజాకలం)ఆళ్లపల్లి మండలం ఆళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ వాసం సుష్మిత హాజరయ్యారు. ఈ



సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని వాసం భవదీప్ అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసం సుష్మిత మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి ధర్మానికి, ప్రేమకు, భక్తికి ప్రతీక అని అన్నారు. శ్రీకృష్ణుని బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులు, దీవెనలు ఆళ్లపల్లి మండల ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మొదటి వార్డు సభ్యులు కోడెం సత్యం, యూత్ మండల అధ్యక్షులు శ్రీనాథ్, పోకల మహేష్, శ్రీరామ్ సంపత్, అర్రెం సుమన్, పాయం నాగరాజు, గౌరబోయిన సాంబయ్య, జోగా వసంతరావు, బత్తిని రాజేష్, సాదిక్, మహిళా నాయకులు పానుగంటి మంగ, వాసం సుశీల, వాసం సింధు తదితరులు పాల్గొన్నారు.

### నక్కలపల్లి గేటు నుంచి బండరాయిపాకుల వరకు

# 5.52 కోట్లతో డబుల్ బీటీ రోడ్డు

## – మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవి చేతుల మీదుగా శంకుస్థాపన



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 05 ప్రజా కలం (ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం పరిధిలోని నక్కలపల్లి గ్రామ గేటు నుంచి వెన్నచర్ల మీదుగా బండరాయిపకుల గ్రామం వరకు రూ.5.52 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న డబుల్ బీటీ రోడ్డుకు ఘనంగా శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథులుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి మండలం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా నక్కలపల్లి గేటు నుంచి వెన్నచర్ల మీదుగా బండరాయిపకుల వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మించాలనే లక్ష్యంతో మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ రోడ్డు నిర్మాణం అవసరాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మంత్రి ధనసరి సీతక్క దృష్టికి కూడా తీసుకెళ్లి, రూ.5.52 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే తుడుకుర్తి, రేవల్లి, నాగపూర్, బండరాయిపకుల, వెన్నచర్ల, నక్కలపల్లి తదితర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు ఆయా గ్రామాల అభివృద్ధికి ఈ రోడ్డు కీలకంగా మారనుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ వీధుల్లో కూర్చొని కేంద్ర, రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడడం ద్వారా అభివృద్ధి జరగదని ప్రజల సమస్యలను సంబంధిత నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి చెందుతాయని పలువురు పేర్కొన్నారు ప్రజా సమస్యల పరిష్కారం గ్రామాల అభివృద్ధి కోసం అంకితభావంతో కృషి చేస్తున్న మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు కొల్లాపూర్ నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమని విమర్శించే వారికి జరుగుతున్న అభివృద్ధి పనులే సమాధానం అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అదనపు కలెక్టర్ దేవ సహాయం నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ ఐపీఎస్ డిఎస్పి శ్రీనివాసులు పంచాయతీరాజ్ శాఖ అధికారులు నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు నిరంజన్ పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి సత్యం మేకల గౌరమ్మ చంద్రయ్య మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తగిలి కృష్ణయ్య ఆయా గ్రామాల సర్పంచులు మొట్టే కురుమయ్య ఉప సర్పంచ్ కొత్త రవీందర్ రెడ్డి వై రాముడు మాజీ ఉపసర్పంచ్ మేకల మల్లేష్ వార్డు సభ్యులు కోళ్ల మల్లేష్ వంగూరు స్వామి మద్యని పద్మ అడిమయ్య నాగమ్మ అగరయ్య తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 05:

ప్రానిక ప్రభుత్వ ఎనిఆర్ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో అధ్యాపకులు, విద్యార్థినిలంతా కలిసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లిడాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల అలంకరించి, పూజానంతరం అధ్యాపకులు విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగాలతో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్. డి. ప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం. భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యపుస్తకంలోని విషయాలను మాత్రమే బోధించేవాడు కాదు.

ఎలా చదవాలి? ఎలా ఆలోచించాలి? ఎలా ప్రవర్తించాలి? జీవితంలో ఎలా ముందుకు సాగాలి? అనే విషయాలను కూడా నేర్పిస్తాడు.

ఒక విద్యార్థి జీవితంలో గురువు పాత్ర ఎంతో గొప్పది. విద్యార్థి తన జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా, ఆ విజయానికి వెనుక ఎక్కడో ఒకచోట ఒక గురువు యొక్క కృషి తప్పకుండా ఉంటుంది.

మన జీవితంలో ఎన్నో విషయాలను మనం మరిచిపోవచ్చు. కానీ మనకు మొదటిసారి అక్షరాలు నేర్పిన గురువును, మనలో ధైర్యాన్ని నింపిన గురువును, మన తప్పులను సరిదిద్దిన గురువును మాత్రం జీవితాంతం గుర్తుంచుకోవాలి.

ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక మంచి విద్యార్థిని మాత్రమే తయారు చేయడు; ఒక మంచి కుటుంబాన్ని, ఒక మంచి సమాజాన్ని, చివరికి ఒక మంచి దేశాన్ని తయారు చేస్తాడు అంటూ మాట్లాడారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇంచార్జ్ డాక్టర్. కె. హరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున గురువులకు పూలు ఇవ్వడం, శుభాకాంక్షలు చెప్పడం చాలా మంచి విషయం. కానీ ఒక గురువుకు విద్యార్థి ఇవ్వగలిగే అత్యంత గొప్ప బహుమతి అతని విజయం. మీరు మంచి వ్యక్తిగా ఎదిగితే అది గురువుకు గర్వకారణం. మీరు సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదిగితే అది గురువుకు గర్వకారణం.

మీరు మీ తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తే అది గురువుకు నిజమైన గౌరవం.

మీ జీవితం విజయవంతంగా మారడమే మీ గురువుకు మీరు ఇవ్వగలిగే అత్యుత్తమ టీచర్స్ డే గిఫ్ట్ అని తెలిపారు. ఉర్దూ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. మహ్మద్ వహిదుద్దీన్ మాట్లాడుతూ

మీ జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకోండి.

ఆ లక్ష్యాన్ని సాధించడానికి ప్రతిరోజూ కొంత సమయం కేటాయించండి ఎంత పెద్ద కలలు కన్నా తప్పు లేదు.

ఎందుకంటే పెద్ద విజయాలన్నీ ఒక చిన్న కలతోనే మొదలవుతాయి. మీ పరిస్థితులు మీ భవిష్యత్తును నిర్ణయించవు. మీ ఆలోచనలు, మీ కృషి, మీ నిర్ణయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

కాబట్టి విద్యార్థులారా...

గురువులను గౌరవించండి.

తల్లిదండ్రులను గౌరవించండి.

సమయాన్ని గౌరవించండి.

విద్యను గౌరవించండి.

మీ జీవితాన్ని గౌరవించండి.

ఎప్పుడూ గుర్తుంచుకోండి:

"గురువు చూపిన మార్గంలో నడిచే విద్యార్థితన జీవితంలో ఎప్పటికీ దారి తప్పడు."

మీరు రేపటి భారతదేశం.

మీ ఆలోచనలు భారతదేశ భవిష్యత్తు. మీ విజయమే దేశ విజయానికి మొదటి అడుగు.

మీ అందరికీ ఉజ్వలమైన భవిష్యత్తు కలగాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నాను అంటూ మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# వినాయకచవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

## అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాటుకు పూర్తి చేయాలి – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 05:

వినాయక చవితి ఉత్సవాలను ఎటువంటి సమస్యలు లేకుండా, సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, అలాగే నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముందుగా గతంలో ఎదురైన సమస్యలు, అవసరమైన సౌకర్యాలపై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్‌లో ప్రతి సంవత్సరం సుమారు 350 గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి మండపాలకు ఉచిత విద్యుత్తు కనెక్షన్లు, నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లు, తగినంత లైటింగ్, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన తీసుకోవాల్సిన చర్యలు, చేయాల్సిన ఏర్పాట్లను గురించి వివరించారు. ముఖ్యంగా శోభాయాత్ర మార్గాల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరిచేయడంతో పాటు గుంతలను పూడ్చి రహదారులను మరమ్మతు చేయాలని, విగ్రహాల తరలింపునకు అవసరమైన వాహనాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్, ఆర్ అండ్ బి, రవాణా శాఖా అధికారులను ఆదేశించారు. మండపాల వద్ద తొమ్మిది రోజుల పాటు నిరంతర పారిశుధ్య చర్యలు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్లు సక్రమంగా అందేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలను నివారించేందుకు నిర్వాహకులు తప్పనిసరిగా అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు, కార్బన్ డయాక్సైడ్ (జూ2) ఎక్స్‌టింగ్విషర్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు మండపాలను ముందుగానే తనిఖీ చేసి నిర్వాహకులకు భద్రతా సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. వినాయకుని నిమర్జనం సమయంలో , నిమజ్జన పాయింట్ల వద్ద ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు, అత్యవసర వైద్య సేవలు, తగిన సంఖ్యలో అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అంబులెన్స్‌లు జనసమ్మర్ధంలో చిక్కుకోకుండా వ్యూహాత్మక ప్రాంతాల్లో ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో చిన్న విగ్రహాల నిమజ్జనం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో కృత్రిమ నిమజ్జన కొలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాత్కాలికంగా ప్లాస్టిక్ షీట్లతో కొలనులు ఏర్పాటు చేయాలని, అలాగే మున్సిపాలిటీ పరిధిలోనూ అవసరమైన ప్రాంతాలను గుర్తించి మూడు, నాలుగు కృత్రిమ నిమజ్జన కొలనులు ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల సహజ నీటి వనరులపై ఒత్తిడి, కాలుష్యం తగ్గడంతో పాటు ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు సురక్షితమైన నిమజ్జన సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిమజ్జన పాయింట్ల వద్ద తగిన సంఖ్యలో గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు మున్సిపాలిటీల పరిధిలోని గణేష్ మండపాల వద్ద గ్రామ పంచాయతీలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం సహకారంతో తాగునీటి సౌకర్యం కల్పించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన శోభాయాత్ర మార్గాల్లో నీటి పైప్‌లైన్లు, ఇతర నిర్మాణాలు అడ్డంకిగా లేకుండా ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద, శోభా యాత్ర మార్గం గుండా భక్తులకు ప్రజలకు త్రాగు నీటి సౌకర్యం, అందించేలా స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని సూచించారు. గణేష్ చతుర్థి, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా మరోసారి అధికారులను ఆదేశించారు.

# విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది..

## – డాక్టర్ ఆంజనేయ గౌడ్, హనుమంతు నాయుడు




గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజా కలం:

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం గద్వాల జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణవేణి చౌక్ నుంచి వైఎస్సార్ చౌక్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం నిర్వహించిన సభలో ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నడిగడ్డలో మెడికల్, నర్సింగ్, ఐటీఐ, బీసీ స్టడీ సర్కిల్, గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు.

బీఆర్ఎస్ గద్వాల ఇన్‌చార్జి హనుమంతు నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచులు, బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గుర్తింపులో పారదర్శకత తప్పనిసరి

## – ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ షేక్ ఫారూక్ హుస్సేన్




గద్వాల ప్రతినిధి సెప్టెంబర్ ప్రజా కలం

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల కన్వీనర్ షేక్ ఫారూక్ హుస్సేన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కమిటీ పారదర్శకంగా పనిచేసి అర్హులైన ఉద్యమకారుల అందరినీ గుర్తించాలని కోరారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో శ్రీ అతికూర్ రహమాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఫారూక్ హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలని, అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యమకారులకు ఇంటి నిర్మాణం కోసం 250 గజాల ఉచిత స్థలం, రూ.25 లక్షల ఆర్థిక సహాయం, నెలకు రూ.25 వేల పెన్షన్ అందించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.2,000 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఉద్యమకారుల అభిప్రాయాలను తీసుకుని జోగులాంబ గద్వాల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా అతికూర్ రహమాన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. ప్రభాకర్ ఎంపిక కాగా, వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో నాగర్‌దొడ్డి వెంకటరాములు, భీంసేన్‌రావు, అబ్దుల్ రవూఫ్, అచ్చన్నగౌడ్, బి. ఆంజనేయులు, తాహెర్, వినోద్, ముహమ్మద్ రహమతుల్లా, గోపాల్ యాదవ్, టవర్ మక్బూల్, రంగు సుమలతతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# విద్యా భారతి పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

## – చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో విద్యార్థుల సందడి– ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నిర్మల్ సెప్టెంబర్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) పల్సిలోని విద్యా భారతి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ పురంశెట్టి లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సవంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని భక్తి శ్రద్ధతో ఆరాధించి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. విద్యార్థులు చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో ముస్తాబై అందర్నీ ఆకట్టుకున్నారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇతర విద్యార్థులు దాండియా నృత్యాలతో సందడి చేస్తూ అలరించారు. ఉత్సవంగా ఉట్టికొట్టే కార్యక్రమం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టికుట్టే కార్యక్రమంలో విద్యార్థులతో పాటు యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దీంతో పాఠశాల ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఆకట్టుకున్న శ్రీకృష్ణ జన్మ ఘట్టం వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతాన్ని విద్యార్థులకు వివరించారు. విష్ణుమూర్తి దశావతారాల్లో శ్రీకృష్ణ అవతారం విశిష్టమైందని, ధర్మ పరిరక్షణ కోసం శ్రీకృష్ణుడు అనేక ధర్మ కార్యాలను నిర్వహించారని ప్రిన్సిపల్ పురంశెట్టి లింగయ్య తెలిపారు. కంసుని సంహారం వంటి ఘట్టాలను విద్యార్థులకు పురాణ కథల రూపంలో వివరించారు. అనంతరం దేవకి వాసుదేవులకు చెరసాలలో శ్రీకృష్ణుడు జన్మించడం వాసుదేవుడు శ్రీకృష్ణుడిని యమునా నదిని దాటించి గోకులానికి తీసుకువెళ్లడం వంటి పౌరాణిక ఘట్టాలను విద్యార్థులు నాటక రూపంలో ప్రదర్శించారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతన్న, లక్మ మధుసూదన్, సాయినాథ్, రాజు, దేవేందర్, డోలేవార్ దేవకి, సరస్వతి, రాణి, శృతిక, పద్మ, సరోజన, గంగామణి, లక్ష్మి, కవిత, నేహా, భువనేశ్వరి, గంగావేణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా




నిర్మల్ సెప్టెంబర్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలో పర్యటించి వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో, పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శనివారం బాసరలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం, గోదావరి నది పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాల షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం భైంసా తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు. నోటీసుల జారీ, తదుపరి ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేసి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వారి సందేహాలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఈఈలు అనిల్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, తహసీల్దార్లు పవన్ చంద్ర, శశి భూషణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ నీటి హక్కులపై రాజీ లేదు

### బీఆర్ఎస్ ధ్వజం - డా. కురువ విజయ్ కుమార్

గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్ 5, ప్రజా కలం: తెలంగాణ నీటి హక్కులను




కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కురువ విజయ్ కుమార్ ఆరోపించారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలంటూ కేఆర్ఎంబీ తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రయోజనాలకు అన్యాయమని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీటి తరలింపుపై కేఆర్ఎంబీ, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ప్రభావం పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. పాలమూరు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 14లోపు తెలంగాణకు నీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో కేటీఆర్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ రాజీపడదని, రైతుల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని డా. విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

## ఎస్పీని కలిసిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గం




నిర్మల్ సెప్టెంబర్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లా పోలీస్ అధికారుల సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందిస్తూ, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులపై సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, సమన్వయం, సేవాభావాన్ని మరింత బలోపేతం చేయడంలో పోలీస్ అధికారుల సంఘం కీలక పాత్ర పోషించాలని సూచించారు.

నూతన కార్యవర్గ సభ్యులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోలీస్ శాఖ అభివృద్ధి అధికారుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలతో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఆర్ఐ అమిత్ రామ్, అలాగే నిర్మల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పల్సి విద్యా భారతి పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

### విద్య అనే ఆస్తిని ప్రతి విద్యార్థికి సమానంగా పంచే గొప్ప దాత గురువు వృత్తుల్లో గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తి

నిర్మల్ సెప్టెంబర్ 05 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



సందర్భంగా మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటాం. పాఠశాలలోని కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పురంశెట్టి లింగయ్య మాట్లాడుతూ....... సమాజానికి ఉత్తమ పౌరులను అందించే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ. తల్లిదండ్రులైన తమ ఆస్తిని పిల్లలకు పక్షపాతంతో పంచవచ్చు, కానీ తన దగ్గర ఉండే విద్య అనే ఆస్తిని ప్రతి విద్యార్థికి సమానంగా పంచే గొప్ప దాత ఉపాధ్యాయుడు. ఈ ప్రపంచంలో ఎవరెవరినో ఏమేమో చేసి వాళ్లు వాళ్లు గానే మిగిలి పోయేది ఒక్కరే ఒక ఉపాధ్యాయుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతన్న, లక్మ మధుసూదన్, కొట్టే ప్రవీణ్, పురంశెట్టి రాజు, గౌర సాయినాథ్, పంతుల దేవేందర్, డోలేవార్ దేవకి, సరస్వతి, భువనేశ్వరి, సరోజన,గంగామణి, కవిత, రాణి, శృతిక , పద్మ, నేహ, గంగావేణి, లక్ష్మి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుమార్తె ప్రతిభ: పట్టుదలతో ఎంబీబీఎస్ సీటు సాధించిన రాథోడ్ సవిత

తానూర్, సెప్టెంబర్ 05(ప్రజా కలం):ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది ఒక ఆటో డ్రైవర్ కుమార్తె, తండ్రి కష్టాన్ని గుర్తించిన ఆ విద్యార్థిని నీట్ ఫలితాల్లో సత్తా చాటి ప్రభుత్వ వైద్య కళాశాలలో



ఎంబీబీఎస్ సీటు కైవసం చేసుకుంది, తానూర్ మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన రాథోడ్ దేవిదాస్-సంగీత దంపతుల కుమార్తె రాథోడ్ సవిత నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను 467 మార్కులు సాధించి, సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది, కుటుంబ పోషణ కోసం తండ్రి దేవిదాస్ ఆటో నడుపుతూనే కుమార్తె చదువుకు అండగా నిలవగా, తండ్రి కష్టాన్ని వృథా కానివ్వకుండా సవిత శ్రమించి చదివి ఈ విజయాన్ని అందుకుంది, సవిత విజయం పట్ల ఝరి(బి) గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి, ఈ సందర్భంగా గ్రామస్థులు సవితను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని సవిత విజయం నిరూపించిందని, ఆమె విజయం ఎందరో గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు,ఈ సన్మాన కార్యక్రమంలో భైంసా మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేకల దేవదాస్, జల్లేవార్ రాములు, ఆసం మాధవ్, రాథోడ్ లాలు, రాథోడ్ శ్యామ్‌రావు, రాథోడ్ గణేష్, జాదవ్ గోరఖ్‌నాథ్, రాథోడ్ రాజు, రాథోడ్ దేవిదాస్, గైక్వాడ్ సాయినాథ్ తదితరులు పాల్గొని సవితను అభినందించారు.

## గురువుల స్థానంలో విద్యార్థులు.. శాంతి విద్యా నికేతన్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




ఆళ్లపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజాకలం)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని శాంతి విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జీవానంద పూలమాల వేసి నివాళులర్పించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలను నిర్వహించి గురువుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లి తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉపాధ్యాయుల బాధ్యతలను స్వయంగా నిర్వహించడం ద్వారా బోధనలోని కష్టాన్ని, గురువుల పాత్రను అర్థం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జీవానంద మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గురువులు అందించే జ్ఞానం, విలువలు విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని, ప్రతి విద్యార్థి తన గురువుల పట్ల గౌరవభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందుతాయని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో వేడుకలు సందడిగా సాగాయి.ఈ కార్యక్రమంలో సిస్టర్ డామరిష్, ప్రశాంతి, ఉపాధ్యాయురాలు షమిమ్, షమీ, శిరోమణి, జ్యోతి, స్వాతి, విద్యార్థులు క్యూటీ, డింపు, సారిక, సహస్ర, దీక్షిత, అలిజా ఆరీఫా, ఐమాన్, అవంతిక, బ్లెస్సి తదితరులు పాల్గొన్నారు.

## ముసాయిదా ఓటరు జాబితా లోని ఓటర్లందరూ తుది జాబితాలో వుండే లక్ష్యంగా చర్యలు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### - 1,75,858 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు
### - ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం.

ఖమ్మం, సెప్టెంబర్ 05(ప్రజా కలం న్యూస్ )

ముసాయిదా ఓటర్ల జాబితా లో ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కు పొందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్, ఇఆర్ఓలతో కలిసి శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, నోటీసుల జారీలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు, మ్యాపింగ్ లేని, అనామాలీస్ ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందని, ఇందులో 1,75,858 మంది మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీచేయనుండగా, ఇప్పటివరకు 1,75,841 నోటీసులు జనరేట్ చేసి, 1,32,817 మందికి నోటీసులు అందజేశామన్నారు. నోటీసుల ప్రకారం 14,680 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తిచేశామన్నారు. నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలు సమర్పించాలి. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పేర్ల అసంబద్ధత వున్న వారు ధృవీకరణలు సమర్పించకున్న, సంబంధిత బూత్ లెవల్ అధికారులు పంచనామా చేసి ధృవీకరిస్తారన్నారు. అర్హులైన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చు, ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.




2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తుది జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని సూచించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డిసి సదానందం, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి ఎం.రమేష్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ(ఎం) ప్రతినిధి డి.తిరుపతి రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ.గోపాల రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల సాధన కోసం టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్రకు ఘన స్వాగతం

### - రఘునాథపాలెం మీడియా మిత్రుల ఆధ్వర్యంలో ఖదీర్‌కు సన్మానం.



ఖమ్మం సెప్టెంబర్ 05 (ప్రజా కలం న్యూస్):

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు రఘునాథపాలెం మండల మీడియా మిత్రులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

ఖమ్మం అర్బన్ తహశీల్దార్ కార్యాలయం నుంచి రఘునాథపాలెం వరకు పాదయాత్ర కొనసాగగా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీడియా మిత్రులు భూక్య శ్రీను, జై భీమ్, భాగ్యరాజు, యోనా, పి. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవి

### - ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి
### - జంగోని గూడలో మైసమ్మ, పోచమ్మ,ఎల్లమ్మ,బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం
### - ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.51,000 విరాళం అందజేత

నందిగామ సెప్టెంబర్ 05 ( ప్రజా కలం ప్రతినిధి )

మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండలంలోని జంగోని గూడలో మైసమ్మ,పోచమ్మ,ఎల్లమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు రూ. 51 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు.మైసమ్మ, పోచమ్మ,ఎల్లమ్మ,బొడ్రాయి తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గ్రామాల్లో ఘనంగా నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు.అమ్మవార్ల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంతిరెడ్డిగూడ సర్పంచ్ మంజుల యాదగిరి,వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు,మాజీ సర్పంచులు వంకాయల రామ్ రెడ్డి,సుధాకర్ గౌడ్,జెకే నర్సిమ,ఉపసర్పంచ్ మల్లేష్, నాయకులు జంగ నర్సిమ,జిల్లెల జనార్దన్ రెడ్డి,జిల్లెల బాల్ రెడ్డి,జంగిలి కుమార్,శ్రీకాంత్ గౌడ్,సుదర్శన్ గౌడ్,కర్ణప్ప,తుమ్మల నర్సిమలు,శివ చారి,చందు,తుప్పుడు క్రిష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### - నందిగామ మండలం జంగోనిగూడలో వైభవంగా గ్రామదేవతల విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం
### - దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టిన దేవాలయ కమిటీ సభ్యులు

నందిగామ సెప్టెంబర్ 05 ( ప్రజా కలం ప్రతినిధి )

నందిగామ మండల పరిధిలోని జంగోనిగూడలో శనివారం గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు, దేవాలయ కమిటీ సభ్యులు వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ ను ఘనంగా స్వాగతించి సన్మానించారు. గ్రామ దేవతల ఆశీర్వాదం గ్రామ ప్రజలందరికీ ఉండాలని ఆయన దేవతలకు మొక్కులు కోరుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డల మంజుల యాదగిరి, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ నాయకులు శివశంకర్ గౌడ్, దేపల్లి కుమార్ గౌడ్, జంగ నర్సింలు, సర్పంచులు గబ్బ చౌహాన్, సాలయ్య, అశోక్ గ్రామస్తులు జంగ మల్లేష్, జంగ శ్రీనివాస్, జంగ చందు, జగన్, అంజి యాదవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులలో విద్యతో పాటు నైతిక విలువలు

# పెంపొందిస్తూ చక్కగా ఎదిగేలా చూడాలి

– మార్కుల కంటే సంస్కారం, సత్యం, నైతిక విలువలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

– ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాలను శాశ్వతంగా మార్చగలరు : జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

– 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం- గురుపూజోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం, సెప్టెంబర్ 05(ప్రజా కలం న్యూస్ )

విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. శనివారం స్థానిక శ్రీ భక్త రామదాసు కళా క్షేత్రంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ,ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. "ఉపాధ్యాయులు పిల్లల జీవితాలను శాశ్వతంగా మార్చగలరని, మనం ఎంతటి ఉన్నత స్థాయికి ఎదిగినా మన గురువుల పట్ల ఉండే గౌరవం ఎప్పటికీ అలాగే ఉంటుంది" అని అన్నారు.
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది మొదటి తరం విద్యార్థులేనని, అలాంటి పిల్లలకు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల పాత్రను కూడా పోషించాలని సూచించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు మంచి నడవడిక, విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు."వివేకం లేని విద్య శూన్యం. మార్కుల కంటే సంస్కారం ముఖ్యమని, పెద్దలను గౌరవించడం, సత్యం కోసం నిలబడటం, నైతిక విలువలను పాటించడం వంటి విలువలను విద్యార్థులకు బోధించాలి" అని కలెక్టర్ పేర్కొన్నారు.తన విద్యాభ్యాసంలో ఉపాధ్యాయుల పాత్రను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. తనకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు బోధించిన టీచర్ తనకు ఎలాంటి ఫీజు తీసుకోకుండా విద్యాబోధన చేయడంతో పాటు, ఆ సమయంలో వారు అందించిన ప్రోత్సాహం, మద్దతు తనను ఈ స్థాయికి తీసుకువచ్చేందుకు దోహదపడిందని భావోద్వేగంతో తెలిపారు.
సమాజంలో ప్రస్తుతం అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, గతంలో ఉపాధ్యాయులు ఏదైనా మందలించినా అది తమ మంచికేనని విద్యార్థులు, తల్లిదండ్రులు భావించేవారని కలెక్టర్ అన్నారు. ఇంట్లో కూడా ఉపాధ్యాయులను దేవుని రూపంగా గౌరవించేవారని గుర్తు చేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.మంచి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. "ఇల్లు మొదటి పాఠశాల అని, ఇల్లు, పాఠశాలలోని వాతావరణమే పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది" అని తెలిపారు.తన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటూ, ఉపాధ్యాయుని పట్ల తనకున్న గౌరవం కారణంగా తనకు అంతగా ఇష్టం లేని సోషల్ సబ్జెక్టు తర్వాత తనకు ఇష్టమైన సబ్జెక్టుగా మారిందన్నారు. పిల్లలను మంచి మార్గంలో తీర్చిదిద్దే ప్రయత్నంలో ఎప్పుడూ ఆశను వదులుకోకూడదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశావాహ దృక్పథంతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడూ ఉత్తముడేనని, అయితే ఈ రోజు ఉత్తమ ఉపాధ్యాయు లుగా గుర్తింపు పొందిన వారికి లభించిన గౌరవం ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. కోవిడ్ అనంతరం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా మారి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగినప్పటికీ, 90 కి పైగా ప్రైవేట్ పాఠశాలలు ముందుకు వచ్చి బెస్ట్ అవైలబుల్ స్కూల్ విధానంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు సహకరించాయని తెలిపారు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపిక చేయడం అభినందనీయమన్నారు.ఇంచార్జీ జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నవోదు పెరిగిందన్నారు. ఎఫ్ఆర్ఎస్ అమలులో ఖమ్మం జిల్లా ముందంజలో ఉందని, పదవ తరగతి ఫలితాలు కూడా మెరుగ్గా వచ్చాయని తెలిపారు. విద్యా ప్రమాణాల్లో జిల్లా మంచి పనితీరు కనబరుస్తోందని, ఈ ఏడాది ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనాలు ఆరోగ్యదాయకం

– 55 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్న 1972 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 05 (ప్రజా కలం):

నేటి మానవ జీవితం అనేక బాధ్యతలు, ఒత్తిళ్లు, మానసిక సంఘర్షణల మధ్య కొనసాగుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో బాల్య మిత్రులు, పాత స్నేహితులతో కలిసి ఆత్మీయంగా గడపడం మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యదాయకమైన జీవితానికి దోహదం చేస్తుందని నాగర్‌కర్నూల్ జాతీయ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్లా ఖాన్ అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని నేషనల్ హైస్కూల్‌లో 1972 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 55 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో బాల్య మిత్రులు తిరిగి కలుసుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలు, బాధ్యతలు, మానసిక ఒత్తిళ్ల కారణంగా చాలామంది నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో బాల్య మిత్రులను కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం, ఆనందాలను పంచుకోవడం ద్వారా కొంత ఊరట, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. తాము చదువుకున్న పాఠశాలను మరవకుండా 55 ఏళ్ల తర్వాత కూడా పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. పాఠశాల, గురువులు, బాల్య మిత్రులతో ఉన్న అనుబంధం జీవితాంతం గుర్తుండిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, జాతీయ విద్యా సంఘ సభ్యులను ఘనంగా సన్మానించారు. గురువులు సాంబయ్య, సుందరాచారి, అబ్దుల్లా ఖాన్, హఫీజ్ ఖాన్‌లను ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే జాతీయ విద్యా సంఘ సభ్యులు జీ.వీ. సుబ్బారావు, మునింద్రనాథ్ శ్రీధర్ లకు ఘనంగా సన్మానించారు అనంతరం విద్యార్థులకు బ్యాగులు క్రీడ సామాగ్రిని పంపిణీ చేశారు పాఠశాల ఉపాధ్యాయులు రవి వహీద్ ఖాన్ విశ్వేశ్వరయ్య మురళీధర్ రావు ఆర్ సత్యం లను కూడా పూర్వ విద్యార్థులు సన్మానించారు.

## వైద్య, విద్యా రంగాల్లో మహబూబ్‌నగర్‌ను

# అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

**- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 05:

వైద్య, విద్యా రంగాల్లో మహబూబ్‌నగర్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రత్యేక కేంద్రంగా ఎదుగుతోందని ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎఓఐ టిజి సిఓఎన్ 2026 , 11వ తెలంగాణ రాష్ట్ర ఈ ఎన్ టీ (జుచీ) కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు చిన్న పట్టణంగా ఉన్న మహబూబ్‌నగర్‌లో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైద్య రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. నగరంలోని ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, టీచింగ్ హాస్పిటల్ ద్వారా వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందుతున్నాయని, అన్ని ప్రధాన వైద్య విభాగాలతో సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని, త్వరలో వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా అందుబాటులోకి రానుందని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహబూబ్‌నగర్‌లో వైద్య రంగంతో పాటు విద్యా రంగ అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంజినీరింగ్ విద్యలో ఉన్న లోటును అధిగమించేందుకు తెలంగాణతో పాటు దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సంస్థగా పేరున్న ట్రిపుల్ ఐటీ ను మహబూబ్‌నగర్‌కు తీసుకురావడంలో ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం కొనసాగుతుండగా, సుమారు 400 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. నగరంలో ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయం, రెండు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు, రెండు డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అనేక జూనియర్ కళాశాలలు ఉన్నాయని వివరించారు. దీంతో మహబూబ్‌నగర్ ఇప్పటికే విద్యా హబ్‌గా మారిందని, భవిష్యత్తులో మరింతగా వైద్య హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో మరో ప్రభుత్వ మెడికల్ కాలేజీని తీసుకురావాలన్నది తన కల అని, ఇందుకోసం ప్రభుత్వం వద్ద తన వంతు ప్రయత్నం చేస్తానని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నగరాన్ని విద్య, వైద్యం, రవాణా రంగాల్లో మరింత అభివృద్ధి చేసి మెగా సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్ భౌగోళికంగా కూడా ఎంతో అనుకూలమైన ప్రాంతంలో ఉందని, కర్ణాటక సరిహద్దుకు సమీపంలో ఉండటంతో పాటు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, రైల్వే మార్గాలతో మంచి అనుసంధానం కలిగి ఉందన్నారు. విమానాశ్రయం కూడా నగరానికి సుమారు 78 కిలోమీటర్ల దూరంలో ఉందని, భవిష్యత్తులో రాబోయే ఫ్యూచర్ సిటీ కూడా మహబూబ్‌నగర్‌కు సమీపంలోనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ అన్ని అంశాలు నగరాన్ని భవిష్యత్తులో మెగా సిటీగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని తెలిపారు. మహబూబ్‌నగర్ వైద్యుల సేవలను ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా అభినందించారు. మహబూబ్‌నగర్‌లోని వైద్యులు పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ గొప్ప సేవ చేస్తున్నారని అన్నారు. గుల్బర్గా, రాయచూర్‌తో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా రోగులు మహబూబ్‌నగర్‌కు వచ్చి క్లిష్టమైన శస్త్రచికిత్సలు, వైద్య విధానాలను తక్కువ ఖర్చుతో పొందుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులతో పోలిస్తే చాలా తక్కువ ఖర్చుతో ఇక్కడి వైద్యులు క్లిష్టమైన చికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. మహబూబ్‌నగర్‌ను తమ సొంత ప్రాంతంగా భావించి వైద్య సేవలు అందిస్తున్న ప్రతి ఒక్క వైద్యుడికి కృతజ్ఞతలు తెలిపారు.ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైద్య రంగంలో ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ తనదైన ముద్ర వేసిందని పేర్కొన్నారు. వైద్య రంగంలో తాజా ఆవిష్కరణలు, ఆధునిక చికిత్సా విధానాలపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్యులు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడంతో పాటు కొత్త వైద్య విధానాలపై అవగాహనపెంపొందించుకునేందుకు ఇలాంటి సదస్సులు మంచి వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహక కమిటీకి అభినందనలు తెలిపారు. సదస్సుకు హాజరైన ప్రతినిధులు, వైద్య నిపుణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సదస్సు విజయవంతంగా, చిరస్మరణీయంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, డా. పి. విజయానంద రెడ్డి, డా. కె. కృష్ణారెడ్డి, డా. కె.వి. జోషి. డా. హరిప్రసాద్, డా. రణ్‌బీర్ సింగ్, డా. జి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు పనిచేస్తుంది

**భవిష్యత్ తరాలకు బలమైన పునాది - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**69 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 05: భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపడుతోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.
శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ భవిష్యత్తు, మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యారంగ మౌలిక వసతుల కోసం భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని చెప్పారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు అనేక రకాల దృష్టి మళ్లించే అంశాలకు గురవుతున్నారని, వారిని సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై మరింత పెరిగిందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విద్యాబుద్ధులు చెప్పడంతో పాటు విద్యార్థుల్లో మంచి సంస్కారం, విలువలు పెంపొందించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోచోటుచేసుకుంటున్న ప్రతికూల పరిణామాలను అరికట్టి, మంచి పౌర సమాజాన్ని నిర్మించగల శక్తి ఉపాధ్యాయులకు ఉందని పేర్కొన్నారు.మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో విద్యారంగంలో అనేక ప్రయోగాత్మక కార్యక్రమాలనుచేపడుతున్నామని తెలిపారు. డిజిటల్ లెర్నింగ్, టెక్స్ట్ బుక్స్, స్టూడియో, 3డీ యానిమేషన్ల ద్వారా విద్యార్థులకు పాఠాలను సులభంగా అర్థమయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. డిజిటల్ బోర్డులను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. డిజిటల్ బోర్డులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మహబూబ్‌నగర్నియోజకవర్గంలోని 100 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమించి విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్టు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతంలో 30 పాఠశాలల్లో 35 మంది విద్యా వాలంటీర్లను నియమించగా మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. విద్యార్థులకు కేవలం మార్కులు, ఉత్తీర్ణత సాధించడమే కాకుండా వారి సామర్థ్యాలు, ఆసక్తులు, బలాలు, బలహీనతలను గుర్తించి భవిష్యత్తులో వారికి సరైన దిశానిర్దేశం చేయడమే లక్ష్యమన్నారు. ఇందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించే ప్రయోగాన్ని కూడా చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల ప్రతిభను సాంకేతిక డేటా ఆధారంగా విశ్లేషించి, వారి బలాలను మరింత అభివృద్ధి చేయడంతో పాటు బలహీనతలను అధిగమించేలా మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల్లో ఎంతో మంది ఉన్నత స్థాయికి చేరుకున్నారని, విద్యార్థుల్లో ప్రతిభకు లోటు లేదని, వారికి సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.
మహబూబ్‌నగర్ జిల్లా విద్యారంగంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచేలా అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను చదువులోనే కాకుండా క్రీడలు, సంస్కృతి, సృజనాత్మకత, విలువల పరంగా కూడా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం అత్యంత గౌరవంగా చూస్తోందన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం: కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం అని అన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్లే వివిధ రంగాల్లో నిపుణులు, అధికారులు, వైద్యులు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు తయారవుతున్నారని పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ఉపాధ్యాయ దినోత్సవాన్నిపురస్కరించుకుని జిల్లాలోనిఉపాధ్యాయులందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. 30 నుంచి 40 మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఓర్పుతో బోధిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలను ఆమె కొనియాడారు. జిల్లాలో సుమారు 69 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్నప్పటికీ, ప్రతి ఉపాధ్యాయుడూ ఈ గౌరవానికి అర్హుడేనని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులే తొలి ప్రేరణ, మార్గదర్శకులు, ఆదర్శమని పేర్కొన్న కలెక్టర్, నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 69 మందికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి పురస్కారాలు అందజేసి శాలువాతో సన్మానించారు.
కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, విద్యాశాఖ అధికారి విజయకుమారి,
బి.సి సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి విష్ణునందన్, ఎ.ఎం.ఓ డి. శ్రీనివాస్, ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**



ఆళ్లపల్లి, సెప్టెంబర్ 5,(ప్రజాకలం)

ఆళ్లపల్లి మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి కొమరం శాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఉద్యోగ సంఘాల నాయకులు, సీనియర్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. మండల విద్యాధికారి కొమరం శాంతారావు, మర్కోడు ప్రధానోపాధ్యాయులు బి. బాబూలాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని రంగాలకు అవసరమైన నిపుణులను తయారు చేసే మహోన్నతమైన బాధ్యత అని అన్నారు. ఈ వృత్తిలో కొనసాగుతున్నందుకు గర్వంగా ఉందని, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు.
అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో కే.మమతారాణి, ఇర్పా బాలకృష్ణ, వి. కోటేశ్వరమ్మ, కే.శారదామణి, సీహెచ్. సుధారాణి, కే. లాలయ్య, టి.నాగు, జి.కవిత, బి.ఈర్‌లాల్, ఏ.స్వరూప ఉన్నారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు ముడిగ సమ్మయ్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు, టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హథీరాం, టిఆర్ టి యు మండల బాధ్యులు వీరన్న, టీఎస్ టిటిఎఫ్ మండల అధ్యక్షులు ఇస్లావత్ నరేష్, టిపిటిఎఫ్ బానోతు బోజ్యా, టి ఎస్ యు టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శులు అగ్గి రామకృష్ణ, ముత్తయ్య, మండల అధ్యక్షులు చందర్‌రావు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు




## E4M హెల్త్‌కేర్ ఇండియన్ మార్కెటింగ్ అవార్డ్స్ లో మహావీర్ హాస్పిటల్ 'మైండ్‌ఫుల్ మార్నింగ్'కు గోల్డ్

### -- హెల్త్‌కేర్ సుస్థిర మార్కెటింగ్‌లో మహావీర్ హాస్పిటల్ 'మైండ్‌ఫుల్ మార్నింగ్'

### పాజెక్ట్ కు జాతీయ స్థాయి గుర్తింపు...

**- ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌లకు బదులు ఏకో ఫ్రెండ్లీ టూత్ బ్రష్ లు...**

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ప్రజా కలం ప్రతినిధి)

మహావీర్ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో గత సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా.. ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌కు బదులుగా వెదురు టూత్‌బ్రష్‌ను వాడేలా ప్రజలను ప్రోత్సహించింది. ఈ చొరవతో వారు 'మైండ్‌ఫుల్ మార్నింగ్' అనే కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ చేసే ఉదయపు దినచర్యను పర్యావరణ అవగాహన కల్పించే విధంగా మార్చారు. ఈ అద్భుత ఆలోచన ఇ4వీ ఇండియన్ మార్కెటింగ్ అవార్డ్స్ సౌత్ 2026లో ఆరోగ్య సంరక్షణకు




సంబంధించిన సుస్థిర మార్కెటింగ్ విభాగంలో గోల్డ్ అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డును మహావీర్ హాస్పిటల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, టెంపెస్ట్ అడ్వర్టైజింగ్, ట్రస్టీ మెంబర్ అయిన రేఖా ఓస్వాల్ అందుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 23 బిలియన్లకు పైగా ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌లు పారవేయబడుతున్న నేపథ్యంలో.., పళ్ళు తోముకోవడం వంటి ఒక సాధారణ దినచర్య కూడా మన రోజువారీ అలవాట్లు, పద్ధతులను పునరాలోచించుకోవడానికి ఒక అవకాశాన్ని అందిస్తోంది.

హైదరాబాద్‌లోని మసబ్ ట్యాంక్‌లో ఉన్న మహావీర్ హాస్పిటల్ డెంటల్ విభాగం.., రోగులు, సందర్శకులు మరియు సిబ్బందికి పర్యావరణ అనుకూల వెదురు టూత్‌బ్రష్‌లతో పాటు సమాచార కరపత్రాలను పంపిణీ చేయడం ద్వారా ఈ ఆలోచనకు ప్రాణం పోసింది. తద్వారా ఈ అవగాహనను మరుసటి రోజే ప్రారంభించగలిగే ఒక కార్యాచరణగా మార్చింది. ఈ ప్రచారం, కేవలం రోగుల గురించే కాకుండా, వారు నివసించే సమాజం, పర్యావరణం పట్ల కూడా శ్రద్ధ వహించే బాధ్యతాయుతమైన ఆరోగ్య సంరక్షణ పట్ల మహావీర్ హాస్పిటల్ యొక్క విస్తృత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ సహకారంతో రూపొందించబడిన ఈ ప్రచారం, ఒక సందర్భోచితమైన వినూత్న సామాజిక ప్రయోగం., ఒక సరళమైన ఆలోచన, సమాజహిత ప్రచారం ఎలా గుర్తించదగిన ప్రభావాన్ని సృష్టించగలవో ప్రదర్శిస్తుంది.

## సమస్య చెబితే చాలు.. పరిష్కారం ఖాయం!

### - కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్‌కు ప్రజల ప్రశంసలు.

వేములవాడ, సెప్టెంబర్ 05 ( ప్రజా కలం ప్రతినిధి) : ప్రజా సమస్యల పరిష్కారంలో తక్షణ స్పందనకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న వేములవాడ పట్టణ 8వ వార్డు కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్‌ను వార్డు ప్రజలు కొనియాడుతున్నారు,వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని స్థానిక వార్డు ప్రజలు పేర్కొంటున్నారు, తాజాగా వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించేందుకు కౌన్సిలర్ శ్రీనివాస్ చొరవ చూపారు,సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు,ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్‌తో పాటు సెస్ ఏఈ సిద్ధార్థ్ కి వార్డు ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.ప్రజల సమస్యే తన సమస్యగా భావిస్తూ పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్ తీరుపై వార్డు ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## సొంత ఎదుగుదల కన్నా బంజారా జాతి ఎదగడం ముఖ్యం

### -ఆలిండియా బంజారా నేత శంకర్ పవర్



నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 05:

డాక్టర్ శంకర్ సేవియా నాయక్/ పవార్ ఒక బంజారా వ్యక్తి అసాధారణ విజయ గాథ పుస్తకం గోర్ మాటి భాషలో పుస్తకం "బాజ్ వడరో" (ఎత్తైన ఎగరడం). ఇది డాక్టర్ శంకర్ గురించి రాసిన ఆత్మకథ పుస్తకం. "మేం కూడా ఒక నది లాంటి వాళ్ళం, మాకు మా నైపుణ్యం తెలుసు, మేం ఏవైపు నడిచినా దారి ఏర్పడుతుంది. భారతీయ వైవిధ్యంలో స్వతంత్ర సంస్కృతిని సాగుచేసే సమాజం మా లంబాడి సమాజం" అంటారు శంకర్. ఆయన తెలంగాణ నుంచి కాలి చేతులతో మహారాష్ట్రకు వచ్చి కోటీశ్వరుడుగా ఎదిగిన మహోన్నతమైన వ్యక్తిత్వం. తాండూర్ నుంచి తమ తల్లిదండ్రులతో పూణే, థానే నగరాల్లో భృతి కోసం పెట్రోల్ పంపుల వద్ద, గ్యారాజీలో హెల్పర్, హోటల్లో వెటర్ గా పనిచేస్తూ ఎంతో అవమానాలతో తన బాల్యం నుంచి యవ్వనం వరకు జీవనం సాగించారు. చివర్లో కాంట్రాక్టర్ గా మారి అంచెలంచెలుగా ఓ ఉన్నత బిల్డర్ గా థానే సిటీలో బిజినెస్ టైకూన్ గా మారారు. మరోవైపు తమ లంబాడి జాతి కోసం నిరంతరం అన్ని విధాలుగా సేవలను అందిస్తున్న సామాజిక సేవకుడు.

ప్రస్తుతం ఆలిండియా బంజారా సేవ సంఘం అధ్యక్షులుగా 26రాష్ట్రాల్లో తమ జాతికి అంకితమైన నేత. ముంబై థానేలో తమ జాతి 20లక్షలుగా ఉన్నారని, వారిని కౌన్సిలర్, ఎమ్మెల్యే, ఎంపీగా మార్చి తమ సమస్యల నివారణ కోరున్నామన్నారు. ఓ స్పష్టమైన రాజకీయ దృక్పథం కల్గిన నేత. శుక్రవారం ముంబైలోని మజ్దూర్ సంఘటన నేతలు ఆయనతో కల్సి, అట్టి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో మహారాష్ట్ర స్టేట్ బీసీ కమిషన్ సభ్యులు జ్యోతిరాం చౌవాన్, కార్మిక నేతలు బండు రత్నవత్, రమేష్ చౌవల్, వి.శంకర్, ఎం.హన్మంతు, వి.రవి, మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.

## విద్యార్థిని,విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### - ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్ 05 (ప్రజా కలం)

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు

శనివారం రోజున కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఉపాధ్యాయుల దినోత్సవం మరియు దిగంవత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. సమాజంలో పవిత్రమైన స్థానం ఉపాధ్యాయులదని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపిక చేయడం ఉపాధ్యాయులకు ఎంతో గౌరవ ప్రదంగా ఉంటుందన్నారు. గురువులను సన్మానించుకోవడం అంటే ఒక జన్మదిన ధన్యమే అని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత మనం ఎక్కువ గౌరవించేది గురువులని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే వారిని తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని వారి సేవలను కొనియాడారు. గురువులు ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తులో వెలుగులు నింపారని తెలిపారు. ఉపాధ్యాయుల శ్రమ మట్టిలో మాణిక్యం లాంటిది అని,ఉపాధ్యాయులు పిల్లలను తన సొంత పిల్లలుగా చూసుకుంటున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబంలో పుట్టి ఒక ఉన్నత స్థాయికి ఎదిగామంటే ఆ గౌరవ ప్రదం గురువులకే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారతదేశం తోనే కాకుండా ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా విద్యా రంగం పై పెద్దపీట వేసిందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సన్న బియ్యంతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో అన్ని మౌలిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఉపాధ్యాయులు ఏ పని చేసిన ఒక చిత్త శుద్ధితో పని చేస్తారని ఉపాధ్యాయులను అభినందించారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ... ముందుగా ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయలు సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి నడవడిక,క్రమశిక్షణ,నైతిక విలువలు నేర్పిస్తూ వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని,వారి బోధన, ప్రోత్సాహం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి,ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య,ఆహారం అందేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. అనంతరం 80 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలు,మెమెంటో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, జడ్పీ సీఈఓ శోభారాణి,జిల్లా విద్యాధికారి బిక్షపతి,మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుపూజోత్సవం: పాలెం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 05:

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉ



పాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వసంత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి నిరంతరం కృషి చేస్తూ, వారిని బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సమాజానికి దిశా నిర్దేశం చేసే ఉత్తమ పౌరులను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, చంద్రశేఖర్, రాజేందర్, జయశ్రీ, త్రివేణి, మమత,రాజేశ్వరి, శ్రీ వేణి, నచ్చయ్య తదితరులు పాల్గొన్నారు




## నూతన ఇసుక రీచ్‌లపై డీఎల్ఎస్సీ సమీక్ష

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 05 ( ప్రజా కలం ప్రతినిధి) : జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, నిర్మాణాలు, వాణిజ్య అవసరాలకు ఇసుక కొరత లేకుండా నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్సీ) సమావేశం నిర్వహించారు, నూతన ఇసుక రీచ్‌ల గుర్తింపులో భాగంగా మైనింగ్, నీటిపారుదల, భూగర్భజలాలు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు ఇప్పటికే పలు ప్రాంతాలను పరిశీలించారు, ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పరిశీలనల వివరాలను సమావేశంలో సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలకు అనుగుణంగా నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈసమావేశంలో టీజీఎండీసీ పీఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడీ క్రాంతికుమార్, నీటిపారుదల శాఖ అధికారులు ప్రశాంత్, కిషోర్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్లు మహేష్, మురళి, భూగర్భజల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిప్పాపూర్‌లో కోతుల బెడద

### - చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ల వినతి.

వేములవాడ సెప్టెంబర్ 05 ( ప్రజా కలం ప్రతినిధి) : పట్టణంలోని తిప్పాపూర్ 7, 8వ వార్డుల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు ఎల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్ కోరారు,ఈ మేరకు




శనివారం మున్సిపల్ కమిషనర్ లోకేష్ కు వినతిపత్రం అందజేశారు. కోతులు ఇళ్లలోకి చొరబడుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయని కౌన్సిలర్లు తెలిపారు,దీంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావడానికి సైతం భయపడుతున్నారని పేర్కొన్నారు,కోతుల సంచారంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని 7, 8వ వార్డుల్లో కోతుల సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు, ప్రత్యేక చర్యలు చేపట్టి కోతులను పట్టుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ను విజ్ఞప్తి చేశారు.

## యూత్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలి

### - కందుకూరులో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో నిరసన

### - కందుకూరు మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్

### - బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్

**కందుకూరు, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, జిల్లా నాయకుడు గంగాపురం లక్ష్మీ నర్సింహ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ యువతకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు, విద్యార్థులు మరియు యువతకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలపై ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని వారు విమర్శించారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను స్పష్టమైన కార్యాచరణతో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ఉద్యోగ నియామకాలను వేగవంతం చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. యువతకు ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని




వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం సెక్రటరీ సామ మహేందర్ రెడ్డి, లేమూర్ సర్పంచ్ మేఘనాథ్ రెడ్డి, పొట్టి ఆనంద్, సామ ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురేష్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, యూత్ నాయకులు బాచుపల్లి ఉప సర్పంచ్ కుమ్మరి నరేష్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ గొర్రెంకల రామకృష్ణ, మన్నె నరేందర్, కాసోజు ప్రశాంత్ చారి, గాదె రవీందర్, రావిచెట్టు శ్రీనివాస్, మహమ్మద్ అంజద్, తాళ్ల నరేందర్, నగేష్, రాఘవేందర్ గౌడ్, అఖిల్ కుమార్, భరత్ చారి, రమాకాంత్ రెడ్డి, మహేందర్, వినోద్, ముఖిం, బాబు తదితరులు పాల్గొన్నారు.



## తిమ్మాపూర్‌లో మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 ప్రజా కలం :

ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు గ్రామ సర్పంచ్ సోనిప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు కొబ్బరికాయలు కొట్టి భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సంఘ భవనం మంజూరు చేసినందుకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళలకు పెద్దపీట వేస్తూ, వారి అభివృద్ధి, సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగమేశ్వర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుర్మ సాయిబాబా, మాజీ సర్పంచ్ రవీందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థినికి ఘన సన్మానం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సయ్యద్ నబియా సుల్తానా అరుదైన ఘనతను సాధించి ఎల్లారెడ్డి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన నబియా సుల్తానాను ఎల్లారెడ్డి ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం



ఘనంగా సన్మానించారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో 36 గంటల పాటు నిర్వహించిన 'ఏజెంటిక్ ఏఐహ్యాకథాన్--2025'లో పాల్గొని, ఏకంగా 2,089 మందితో కలిసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వామిగా నిలిచారు. ఈ అరుదైన విజయంతో ఆమె తన కుటుంబానికే కాకుండా ఎల్లారెడ్డి ప్రాంతానికి, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు నబియా సుల్తానాను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ గయాజుద్దీన్, ఉపాధ్యక్షులు సయ్యద్ మీర్, ముక్రమ్ అలీ, ప్రధాన కార్యదర్శి అజీజుర్ రెహమాన్, జాయింట్ సెక్రటరీలు అహ్మద్ పాషా, హబీబ్ జానీ, అలాగే కమిటీ సభ్యులు ఎండి నయీమ్, సమీర్, హఫీజ్ రఫీఖుల్లా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయురాలు భవాని

- కామారెడ్డి జిల్లాకు జాతీయస్థాయిలో అరుదైన గౌరవం
- గాంధారి బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గా పనిచేస్తున్న భవాని



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 ప్రజా కలం :

తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లాకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. జిల్లాలోని గాంధారి బాలికల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బొంపల్లి భవాని జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయు రాలిగా గుర్తింపు పొందారు. ఈ మేరకు శనివారం ఆమె ఢిల్లీలోని విజ్ఞాన భవన్లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 48 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. వీరిలో తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయురాలు భవాని కావడం విశేషం. ఆమెకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల గాంధారితో పాటు కామారెడ్డి జిల్లా ప్రజలు, ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేయడంతో పాటు అభినందనలు తెలిపారు. ఆమె 2018 సంవత్సరం నుండి గాంధారి బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. అదే సమయంలో పాఠశాలల విద్యార్థుల సంఖ్య 20 నుంచి 150 కి పెంచారు. ఆమె కృషిని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఎస్సీఈఆర్టీ ట్రైబలైజర్స్ పుస్తకంలో ఆమె పాఠాన్ని చేర్చింది. 2025లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా అందుకున్నారు. తాజాగా 2026 లో దేశవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 48 మందిలో ఏకైక మహిళా టీచర్ భవాని కావడం విశేషం.

# బోధన్‌లో 'నకిలీ' గుట్టురట్టు

### నలుగురు కేటుగాళ్ల అరెస్ట్
### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం
### :నకిలీ సర్టిఫికెట్ల ముఠాను పట్టుకున్న పోలీసులు




నిజామాబాద్,

(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 05:

బోధన్ పట్టణం రాకాసిపేట్ లోని "సహారా మీ సేవ కేంద్రం" లో నకిలీ ప్రభుత్వ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు, నిజామాబాద్ పోలీస్ కమీషనర్ ఆదేశముల మేరకు నిజామాబాద్ సిసిఎస్ ఏసిపీ శ్రీశైలం , సిసిఎస్ సిబ్బంది మరియు బోధన్ పోలీస్ సిబ్బంది కలిసి, రాకాసిపేట్ పెద్ద మసీదు దగ్గర గల సహారా మీ సేవ కేంద్రంలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. తనిఖీలో మీ సేవ ఆపరేటర్ షేక్ వసీమ్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు హొసంపాదించాలనే దురాశతో గత రెండు సం ల నుండి మీ సేవ యజమాని మహమ్మద్ ముక్రమ్ , మరియు ఇతరులతో కలిసి తన మీ సేవ సెంటర్ నందు మరియు ఇంటిదగ్గర నకిలీ మీ సేవ సర్టిఫికేట్ లు తయారు చేసి ఇస్తున్నా డని, అట్టి సర్టిఫికేట్ లపై సంబందిత రబ్బర్ స్టాంప్ లు వేసి ఒరిజినల్ సర్టిఫికేట్ ల లాగా ఇస్తున్నారుహొ , ఒక్కో సర్టిఫికెట్ కు రూ. 5,000/- నుండి రూ. 10,000/- వరకు వసూలు చేసి పంచుకునేవారు. అట్టి సర్టిఫికేట్లను తీసుకున్నవారు మోసపూరితముగా ప్రభుత్వము నుండి లబ్ది పొందుటకు అట్టి నకిలీ సర్టిఫికేట్ లను ఉపయోగించినరనిహొతెలిసినది.

ముద్దాయిల వివరములు:

1)షేక్ వసీమ్, తండ్రి షేక్ జామీల్, వయస్సు 32 సంవత్సరాలు, కులం ముస్లిం, వృత్తి మీసేవ ఆపరేటర్, నివాసం ఇ.నం. 1-1-674, రాకాసిపే ట్, బోధన్

2)మహమ్మద్ ముక్రమ్, తండ్రి మహమ్మద్ ఆరిఫ్, వయస్సు 36 సంవత్సరాలు, కులం ముస్లిం, వృత్తి వ్యాపారం సహారా మీసేవ సెంటర్యజమాని , నివాసం ఇ.నం. 1-2-120, రాకాసిపేట్, బోధన్

దర్యాప్తు అధికారి వి. వెంకట నారాయణ, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్, ఎల్ రామ్ ఎస్ఐపి పిఎస్ బోధన్ టౌన్

స్వాదినము చేసుకున్న వాటి వివరములు

1) తయారు చేసిన నకిలీ మీసేవ సర్టిఫికేట్ లు-05,

2) ఇప్పటికే తయారు చేసి ఇచ్చిన నకిలీ మీ సేవ జనన ధృవీకరణ జిరాక్స్ పత్రాలు-22

3) తయారు చేయడానికి ఉంచిన మీసేవ ఖాళీ ఒరిజినల్ సర్టిఫికేట్లు- 38

4) రబ్బర్ స్టాంప్-01

5) తయారు చేసిన నకిలీ T.C. మరియు బోనఫైడ్ లు-13

6) షాదీ ముబారక్ కు సంబంధించి తయారు చేసిన నకిలీ జిరాక్స్ కాపీలు-01

7) నకిలీ సర్టిఫికెట్ల తయారీకి ఉపయోగించిన న్యూ ల్యాప్‌టాప్ - 01

8) ఝుఅశీఅ కలర్ ప్రింటర్ -- 01

9) ముద్దాయిల సెల్ ఫోన్ -02

పై పత్రాలను మరియు ఎలక్ట్రానిక్ పరికరాలను హొస్వాదినము చేసుకొని, వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగినధి . పరారీలో ఉన్న మిగతా నిందితుల పై తగు చర్యలు తీసుకొనబడును . ఈ దర్యాప్తు లో సహకరించిన సిసిఎస్ సిబ్బంది స ఐ అజయ్, ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాములు కానిస్టేబుల్ అనిల్, గంగప్రసాద్, మరియు బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ టౌన్ పోలీస్ సిబ్బంది సిఐ వెంకట నారాయణ ఎస్సై ఎల్. రామ్, కానిస్టేబుల్ గంగారం, శివ కృష్ణ లను నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., అబినందించినారు.

## గణేశ్ నవరాత్రులకు పోలీసుల సహకారం అందించండిశాంతియుత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు: సీపీ

### మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలి



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 05:

ఆరర్మూర్ లో గణేష్ చవితి పండుగను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం ఆర్మూర్ క్షత్రియ ఫంక్షన్ హాల్ యందు నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., హాజరై గణేష్ ఉత్సవాల నిర్వహణ,భద్రతా ఏర్పాట్లు,శాంతిభద్రతలు , ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శాంతి కమిటీ సభ్యులు , గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన , సోదరభావంతో కూడిన శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ అనేది ప్రజలందరినీ ఐక్యం చేసే కార్యక్రమమని , ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు , పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు , అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ , పార్కింగ్ , జనసందోహం నియంత్రణకు నిర్వాహకులు ప్రత్యేకంగా సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద డీజేలు , సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన శబ్ద పరిమితులు , సమయ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా కూడా నిర్వాహకులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ముందుగా నిర్ణయించిన మార్గాలు , సమయాలను పాటించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో పాల్గొనే వారు ఎలాంటి రెచ్చగొట్టే నినాదాలు , వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలు , వదంతులను నమ్మవద్దని , ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని , గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా , సురక్షితంగా , విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని అవసరమైన భద్రతా చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా శాంతి కమిటీ సభ్యులు,గణేష్ మండపాల నిర్వాహకులు , ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి మత సామరస్యాన్ని , శాంతిభద్రతలను కాపాడుతూ గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన మాలవ్య, ఐ.ఏ.ఎస్, ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర రెడ్డి , ఏ.సీ.పి ట్రాఫిక్ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సీ.ఐ జాన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గోని లహరి, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటేపల్లి వెంకట్ రెడ్డి, ఆర్మూర్ ఎస్సై రజనీకాంత్ ,బాల్కొండ ఎస్సై శైలందర్, మెండోరా ఎస్సై సుహాసిని, మున్సిపల్ కౌన్సిలర్లు , సర్పంచులు మరియు సార్వజని గణేష్ మండలి సభ్యులు,గణేష్ మండలి నిర్వాహకులు,ఆర్గనైజర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.





## ఘనంగా టీచర్స్ డే వేడుకలు....

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 5 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. వారి మార్గదర్శనంలో తమ భవిష్యత్తును అందంగా, ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాల తో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్లూర్ లో 'ఎస్ఐఆర్--2' నోటీసులపై విచారణ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 05:

వేల్పూర్ మండల పరిధిలోని అక్లూర్ గ్రామంలో శనివారం 'ఎస్ఐఆర్--2' (SIR-2) నోటీసులపై ప్రత్యేక హియరింగ్ (విచారణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేల్పూర్ తహసీల్దార్ (ఎంఆర్ఓ) అనిరుద్ధ



హాజరై విచారణ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నోటీసులు అందుకున్న బాధిత, సంబంధిత వ్యక్తుల నుంచి అధికారులు వివరాలు, అభ్యంతరాలను సేకరించారు. వారు సమర్పించిన ఆధారాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ విచారణ ప్రక్రియ అంతా అత్యంత ప్రశాంతంగా, పారదర్శక వాతావరణంలో ముగిసిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిన్నా జనార్ధన్, జీపీఓ స్వాతి, పంచాయతీ కార్యదర్శి మహేష్, బీఎల్ఓ రాజేశ్వర్, వరలక్ష్మి మరియు గ్రామ రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టం: సుంకెట్ ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 05:

విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న మోర్తాడ్ మండలం సుంకెట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (+ఎవీ) పెద్ది సంతోష్ కుమార్ గారిని "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం" వరించింది. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని



రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఆయనకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు.పాఠశాల అభివృద్ధిలో, విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో సంతోష్ కుమార్ కనబరుస్తున్న ప్రతిభకు గుర్తింపుగా రోటరీ క్లబ్ ప్రతినిధులు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ బాధ్యులు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని, సంతోష్ కుమార్ లాంటి నిబద్ధత గల ఉపాధ్యాయులను గౌరవించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొని సంతోష్ కుమార్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినందుకు ఆయన రోటరీ క్లబ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# సంబరాలు చేసుకోవడం తప్ప ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలి

- ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం మా....
- కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసన
- యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్
- మాన్ సాన్ పల్లి చౌరస్తాలో ధూమ్‌ధామ్ కార్యక్రమం
- తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి






మహేశ్వరం,సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

సంబరాలు చేసుకోవడం తప్ప ప్రజలకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు, యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.మహేశ్వరం మండల పరిధిలోని మాన్ సాన్ పల్లి చౌరస్తాలో మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మర్యాద రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం ధూమ్‌ధామ్ కార్యక్రమంతో తమ నిరసనను వ్యక్తం చేశారు.

### హామీలు ఎక్కడ? అమలు ఎప్పుడు?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్‌లో 2 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా కార్డులు వంటి హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేశారు. ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా ఈ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని వారు విమర్శించారు."ఎన్నికల ముందు హామీలు.. అధికారంలోకి వచ్చాక మౌనం.. యువతను మోసం చేయడమే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం'' అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. యువత, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### 420 హామీల అమలుపై నిలదీత

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు "1000 రోజుల పాలన.. 420 హామీల మోసం" అంటూ నినాదాలు చేశారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను విడనాడి, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. "యువతకు ఇచ్చిన హామీలను కాగితాలకే పరిమితం చేస్తే ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తాం.. హక్కుల కోసం పోరాడుతాం" అని స్పష్టం చేశారు.

యువత భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మహేశ్వరం మండల పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ ఆత్మలింగ మహాగణపతి దేవస్థానంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

మల్కాజిగిరి,సెప్టెంబర్ 05(ప్రజా కలం ప్రతినిధి)



మల్కాజిగిరి బాల సరస్వతి నగర్ లో గల శ్రీ ఆత్మలింగ మహాగణపతి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం శనివారం ఆలయ అర్చకులు శివ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం,మూల మంత్ర హోమం,యంత్ర ప్రతిష్టాపన,ధ్వజస్తంభ ప్రతిష్టాపన,ఆలయ దిగ్బలి,మహా పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్టాపన చేపట్టారు.ఈ మహా అద్భుతమైనటువంటి కార్యక్రమాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు పులిపాక కృష్ణమూర్తి,పులిపాక కాంతారావు,దేశం యాదగిరి గౌడ్,గుజ్జుక వెంకటేష్,బోడికె మనోహర్,బి మహేష్, ఎస్ వి కృష్ణారెడ్డి, శ్రీనివాస్,గోపాల్,డి మహేష్,మధు గౌడ్, సంపత్,అంబదాస్, సురేందర్, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## మత్తుకు దూరంగా.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

### సెప్టెంబర్ 6న ఎన్టీఆర్ మెమోరియల్ బాడీ బిల్డింగ్ పోటీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 05 (ప్రజా కలం ప్రతినిధి)

నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి,ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సికింద్రాబాద్ పార్లమెంటు నాయకుడు నల్లెల్ల కిషోర్ పిలుపునిచ్చారు.తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ నేతృత్వంలో సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లోని తెలుగుదేశం పార్టీ నగర కార్యాలయంలో బాడీ



బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ (శ్రీ హనుమాన్ వ్యాయామశాల, కోటి) సహకారంతో ఎన్టీఆర్ మెమోరియల్ బాడీ బిల్డింగ్ అండ్ మెన్స్ ఫిజిక్,మిస్టర్ తెలంగాణ స్టీల్ మ్యాన్-2026 పోటీలను నిర్వహిస్తున్నట్లు కిషోర్ తెలిపారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం సమీపంలోని లోయర్ ట్యాంక్‌బండ్ తెలుగుదేశం పార్టీ నగర కార్యాలయంలో పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. యువతను చెడుదారికి దూరంగా ఉంచి,వారి ఆలోచనలను క్రీడలు, దేహదారుఢ్యం వైపు మళ్లించాలనే ఉద్దేశంతో ఈ పోటీలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత అలవాటు పడటం ఆందోళనకరమని, క్రీడలపై ఆసక్తి పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ బాడీ బిల్డింగ్ (ఓపెన్), శ్రీ నారా చంద్రబాబు నాయుడు మెన్స్ ఫిజిక్ (ఓపెన్) విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.విజేతలకు నగదు బహుమతులతో పాటు పతకాలు, ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ యువతకు ప్రాధాన్యత ఇచ్చారని, పార్టీ బలోపేతంలో యువత పాత్ర కీలకమని కిషోర్ అన్నారు.తెలుగుదేశం ప్రభుత్వం క్రీడాకారులను, క్రీడారంగాన్ని ప్రోత్సహించిందని గుర్తుచేశారు. యువత అధిక సంఖ్యలో పోటీల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి. బాలరాజ్ గౌడ్, తడక వినోద్ కుమార్, శ్యామ్ సుందర్, కరణం కిరణ్, భాను ప్రకాష్, ఎస్. ప్రకాష్, శక్తి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్... ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రా...!

- నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు పరిష్కరించు
- కేటీఆర్... గత చరిత్ర తెలుసుకొని మాట్లాడు
- సోనియా తెలంగాణ ఇవ్వకుంటే మీ గతి ఏమిటి...?
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వి. హనుమంతరావు



గజ్వేల్:05 సెప్టెంబర్ ( ప్రజా కలం ప్రతినిధి)

కెసిఆర్ ఎర్రవల్లి ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రావాలని, నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హనుమంత రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూశీకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి వెలుగు నింపుతుండగా, మరింత రాష్ట్ర అభివృద్ధి కోసం తగు సూచనలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని దేవత అన్న కెసిఆర్ కాళ్లు మొక్కి నక్క వినయం నటించగా,ప్రస్తుతం రాజకీయ



లబ్ధి కోసం కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.అయితే కాంగ్రెస్ పై విమర్శలు చేసే ముందు కేటీఆర్ గత చరిత్ర తెలుసుకోవాలని హితవు పలకగా,చంద్రబాబు, కెసిఆర్ లాంటి వ్యక్తులకు కాంగ్రెస్ రాజకీయ బిక్ష పెట్టిందని గుర్తు చేశారు.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో సోనియాగాంధీని దేవతగా అభివర్ణించిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు వారిపైనే విమర్శలు చేయడం రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు.రాజకీయ పరిణతి సాధించని కేటీఆర్ తన పద్ధతి, వ్యవహార శైలి మార్చుకోవాలని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కేసీఆర్ దర్శనం కష్టంగా మారిందని,ప్రభుత్వ జీతభత్యాలు పొందుతున్న ఆయన ముఖం చాటేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో కొట్లాడి నిధులు సాధించాలని, అయితే ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనతో ప్రజలు బేరీజు వేసుకొని హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు.ముఖ్యంగా అయోధ్య రాముడుతో రాజకీయం చేస్తున్న బిజెపి సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అడ్డుకొని తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు.పెట్టుబడులు సాధించడానికి ఆయన విదేశీ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుంటే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు కారుకూతలు కూస్తున్నట్లు విమర్శించారు. రాజకీయ కోసం రాష్ట్ర ప్రయోజనాలు అడ్డుకోవడం సరికాదని పేర్కొంటూ కేంద్ర నిధులు సాధించాల్సిన ఇక్కడి బిజెపి మంత్రులు, ఎంపీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట దీక్షలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే అవుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చరిత్రను ఎవరూ చెరిపేయలేరని, దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్రను తక్కువ చేసి చూపించే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి,డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, భూంరెడ్డి ఏఎంసీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి,విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్,పీసీసీ నాయకులు నాయిని యాదగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి,మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి,వెంకటేష్ ముదిరాజ్, మండలాల బాధ్యులు సుఖేందర్ రెడ్డి,అశోక్, నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి మైనార్టీ నాయకులు మతీన్ సమీర్, తదితరులు పాల్గొన్నారు.




Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

## ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం అదృష్టం - గడ్డమీది బాలరాజు

కూకట్ పల్లి, సెప్టెంబర్ 05, ప్రజా కలం ప్రతినిధి:

మేడ్చల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డమీది బాలరాజు అందుకున్నారు. శనివారం



జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాల్ అహ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకల చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ తనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సామాన్య ప్రజానీకం అధికంగా నివసించే ప్రాంతంలో ఓ ప్రైవేటు పాఠశాల అతి తక్కువ ఫీజులతో నెలకొల్పి విద్యను అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రయివేట్ విద్య అందని ద్రాక్ష అనుకుంటున్న ఈ రోజుల్లో తాను నెలకొల్పిన పాఠశాలలో బడుగు, బలహీన ప్రజల స్థోమతకు తగిన విధంగా ఫీజులు ఉంటాయాన్నారు. విద్యా సంస్థలతోనే కాకుండా తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాటుపడుతానని స్పష్టం చేశారు. తనకు జిల్లా పురస్కారం దక్కడానికి చొరవ చూపిన జిల్లా ట్రస్మా, కుత్బుల్లాపూర్ ట్రపసా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏఎస్ఐ జనార్దన్ ముదిరాజ్‌కు ఘన సన్మానం

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 5 (ప్రజా కలం):

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జనార్దన్ ముదిరాజ్‌ను శనివారం ఘనంగా సన్మానించారు.



కొమురవెల్లిలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగుల రాజు ముదిరాజ్, సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య ఆధ్వర్యంలో జనార్దన్ ముదిరాజ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మండల నాయకులు రాగుల ఐలయ్య ముదిరాజ్ పాల్గొని జనార్దన్ ముదిరాజ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతులపై సర్కార్ నిర్లక్ష్యం

### -గుమ్మడిదలలో బీఆర్ఎస్ రైతు సదస్సు ముఖ్య నేతల హాజరు..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

రైతుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.రైతుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.గుమ్మడిదలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సదస్సులో మాజీ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్,పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.రైతుల సమస్యలు, వ్యవసాయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతు బీమా,వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని నాయకులు గుర్తుచేశారు. ప్రస్తుతం రైతు బీమా పునరుద్ధరణ,రైతుబంధు సాయం,రూ.2 లక్షల రుణమాఫీ అమలులో జాప్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.రైతుల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. సదస్సులో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# హామీల అమలేది.. సమాధానం చెప్పండి!

### - విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట.

### - వేములవాడలో విద్యార్థులు, యువతతో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ.



**వేములవాడ, సెప్టెంబరు 05 ( ప్రజా కలం ప్రతినిధి):**

విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శనివారం వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్.. వెయ్యి రోజుల దగా' పేరుతో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు, తెలంగాణ చౌక్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థులు, యువతతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ చౌక్ నుంచి త్రినేత్ర ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. 'వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన' అంటూ నినాదాలు చేశారు, ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులను ఆకట్టుకునేలా కాంగ్రెస్ పలు హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీల పరిస్థితిపై యువతకు సమాధానం చెప్పాలన్నారు విద్యార్థుల ఉన్నత విద్య కోసం రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో జీఓ నంబర్ 97 వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందని విమర్శించారు, అలాగే మెగా డీఎస్సీ నియామకాలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని చల్మెడ ఆరోపించారు, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చినా ఆ దిశగా ప్రభుత్వం ముందుకు సాగడం లేదన్నారు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిరుద్యోగ భృతి హామీ అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు, స్వయం ఉపాధి పథకం కింద రూ.10 లక్షలు, ప్రతి ఇంటికి ఉచిత ఇంటర్నెట్ వంటి హామీల పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు,రుద్రంగి మండలంలో సుమారు రూ.45 కోట్లతో ఏటీసీ ఏర్పాటుకు భూమిపూజ జరిగినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు.రాజన్న ఆలయంలో కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు, విద్యార్థులు, యువత తమ హక్కుల కోసం ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని చల్మెడ అన్నారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ పోరాటంతోనే హక్కులు సాధించుకోవచ్చని యువతకు సూచించారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం హామీలను అమలు చేయాలని, ఖాళీ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు వెంగల అనిత, శ్రీకాంత్‌గౌడ్, వాసాల లావణ్య, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, మారం కుమార్, గోలి మహేష్, నాయకులు గూడూరు మధు, క్రాంతికుమార్, పోతూ అనిల్, పసుల అంజి, మండలాల అధ్యక్షులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.










# విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలి

### - సామాజిక విలువలు, క్రమశిక్షణ నేర్పాలి : ప్రభుత్వ విప్ ఆది మ.

### - జిల్లాలో 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 05 ( ప్రజా కలం ప్రతినిధి) :

విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు, వారిలో మనో వికాసం, సామాజిక విలువలు, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు,జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 37 మందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులపై అత్యంత ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల బోధనలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతూ వారి ప్రతిభను వెలికితీయాలని చెప్పారు.

**విద్యకు పెద్దపీట...**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికే 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభించామని, జిల్లాలో మరో రెండు పాఠశాలలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**టీచర్లే రోల్‌మోడల్స్...**

ఉపాధ్యాయులే విద్యార్థులకు రోల్‌మోడల్స్ అని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధనా విధానం విద్యార్థులపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. విద్యార్థి ఇష్టపడే ఉపాధ్యాయుడు బోధించే సబ్జెక్టుపై కూడా ఆసక్తి పెంచుకుంటాడని తెలిపారు. ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకమన్నారు.

ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు సమర్థంగా విధులు నిర్వర్తించి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా విద్యాధికారి మొండయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్ డివిజన్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### ఉపాధ్యాయులను సన్మానించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్

మహేశ్వరం, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

నాదర్‌గుల్ డివిజన్ బాలాపూర్ మండలంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మర్రి శేషాంక్ రెడ్డి ఆధ్వర్యంలో, నాదర్‌గుల్ డివిజన్ పరిధిలోని బాలాపూర్ మండలంలో గల పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లపు సుభాన్ యాదవ్ - యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, బాలాపూర్ మండల వైస్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు గారు, యూత్ కాంగ్రెస్ నాయకులు మేకం రాహుల్ ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గురువులను శాలువాలతో, పూలమాలలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసే ఉపాధ్యాయులు దేశానికి నిజమైన నిర్మాతలు అని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జరుపుకునే ఈ ఉపాధ్యాయ



దినోత్సవం గురువుల త్యాగాన్ని గుర్తు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, యువ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులకు పోలీసుల ఘన సన్మానం

**- 33 మంది ఉపాధ్యాయులకు ఘన సత్కారం..**

**- 907 మంది విద్యార్థులకు భద్రతపై అవగాహన..**

పటాన్‌చెరు,సెప్టెంబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీరంగూడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 33 మంది ఉపాధ్యాయులను అమీన్పూర్ పోలీసులు ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో 907 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అమీన్పూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రవీణ్ రెడ్డి ఉపాధ్యాయులను సత్కరించి, భావితరాల నిర్మాణంలో వారి సేవలను అభినందించారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, అంతర్జాల భద్రత, మహిళలు, బాలల రక్షణపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతగా వినియోగిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువత బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు..

# పటాన్‌చెరులో పోలీసుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం..

**- ఉపాధ్యాయులకు సన్మానం..**

**విద్యార్థులకు భద్రతపై అవగాహన..**

పటాన్‌చెరు, సెప్టెంబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థుల్లో భద్రత, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరసత్వంపై అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పటాన్‌చెరు పోలీసులు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం




నిర్వహించారు. పటాన్‌చెరు ఎస్‌హెచ్‌ఓ ఎం. రవీందర్, ఎస్ఐ (పరిపాలన) ఎం. మహేశ్వర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరమణి, పోలీస్ సిబ్బంది పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యాబోధనతో పాటు సమాజానికి మంచి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, అంతర్జాల భద్రత, మహిళలు, బాలల రక్షణపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలను అప్రమత్తంగా వినియోగించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి క్రమశిక్షణతో మెలిగి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని పోలీసులు ఆకాంక్షించారు..

# కృష్ణాష్టమి వేడుకల్లో పటాన్‌చెరు సందడి

**- పటాన్‌చెరు వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..**

**- భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం..**

పటాన్‌చెరు, సెప్టెంబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఆలయ కమిటీ,అన్నప్రసాద వితరణ కమిటీ,ఆలయ ధర్మకర్త మెట్టు రమాదేవి, కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిత్య హోమం, బలిహరణం, పల్లకి సేవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ, అన్నదాన కమిటీతో పాటు వేడుకల నిర్వహణకు విశేషంగా సహకరించిన ఎంకేవై బృందం సభ్యులను ఆలయ ధర్మకర్త మెట్టు కుమార్ యాదవ్ ఆశీర్వచనాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు నిరంతరం సేవా కార్యక్రమాలు అందించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ మెట్టు కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికతతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి..



# విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి

**-తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితానికి దిశానిర్దేశం చేస్తారు.**

**-దూమాల ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.**




రాజన్న సిరిసిల్ల సెప్టెంబర్ 5 ( ప్రజా కలం ప్రతినిధి):

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఎస్పీ వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. జీవితానికి అవసరమైన జ్ఞానం, మార్గదర్శకత్వాన్ని ఉపాధ్యాయులు అందిస్తారని పేర్కొన్నారు. గురువులు చూపిన మార్గంలో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు.

**గురువులను గుర్తు చేసుకున్న ఎస్పీ..**

తాను ప్రస్తుతం జిల్లా ఎస్పీ స్థాయికి చేరుకోవడంలో విద్యాబుద్ధులు నేర్పి, సరైన మార్గాన్ని చూపిన గురువుల పాత్ర ఎంతో ఉందని మహేష్ బి.గితే గుర్తు చేసుకున్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులకు దిక్సూచిలా నిలిచి వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు,విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ వారికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు కష్టపడి తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**సోషల్ మీడియా, గంజాయికి దూరంగా ఉండాలి..**

విద్యార్థి దశలో సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద పరిణామాలు ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐలు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**420 హామీలు ఇచ్చి, యువకులకు ద్రోహం చేసింది**

# కాంగ్రెస్ ప్రభుత్వం కాదా

**- నాదర్గుల్ బస్ స్టాప్ నుండి ఎంవిఎస్ఆర్ కాలేజ్ వరకు ర్యాలీ చేసి నిరసన**

**- బడంగ్పేట్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి**




**మహేశ్వరం, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)**

420 హామీలు ఇచ్చి, యువకులకు ద్రోహం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని బడంగ్పేట్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి అన్నారు. మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం బడంగ్పేట్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలన మీద నిరుద్యోగ యువతీ యువకులతో నాదర్గుల్ బస్ స్టాప్ నుండి ఎంవిఎస్ఆర్ కాలేజ్ వరకు ర్యాలీ చేసి ,నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి ఉద్యోగం నోటిఫికేషన్లు ఈయకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి, యువకులకు ద్రోహం చేసిందని, అదేవిధంగా ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులు కేసీఆర్ గారిని పదేపదే రాజీనామా చేయమని అడగడం సమంజసం కాదని, నాయకులు పేర్కొనడం జరిగింది. అదేవిధంగా చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్ కు రేవంత్ రెడ్డికి పోలిక ఎక్కడుందని నాయకులు విమర్శించడం జరిగింది. ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండా దాన్ని కప్పిపుచ్చుకు నేందుకు కేసిఆర్ ని రాజీనామా చేయమని కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు, చేయడం సమంజసం కాదని నాయకులు రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ సర్కిల్, బిఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని విరమించుకోవాలి-బీజేపీ డిమాండ్

**- బిజెపి నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న**

**- తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటేకార్ మధు మోహన్**



మహేశ్వరం, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని వెంటనే విరమించుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. హైడ్రా 22-ఏ నిషేధిత జాబితా కారణంగా తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా కుదేలైందని, సామాన్య ప్రజల ఆస్తులు తమకు తెలియకుండానే నిషేధిత జాబితాలోకి వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆస్తులు అమ్ముకోవడానికి ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టిస్తోందని, 22-ఏ జాబితా వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే లబ్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణలో ఉన్న 22-ఏ నిషేధిత జాబితాను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ నగరంలోని ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటేకార్ మధు మోహన్ తో పాటు బీజేపీ రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు.

# ఈఎస్ఐలో మందుల మోత

**-సీఐటీయూ పోరాటంతో**

**ఏళ్ల తర్వాత ప్రత్యేక మందుల పునరుద్ధరణ..**

పటాన్‌చేరు, సెప్టెంబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఏళ్లుగా నిలిచిపోయిన క్యాన్సర్,కిడ్నీ, గుండె తదితర దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు అవసరమైన ప్రత్యేక మందుల సరఫరా పునరుద్ధరణకు అధికారిక ఆదేశాలు జారీ అయ్యాయి. సీఐటీయూ ఆరు నెలలుగా సాగించిన నిరంతర పోరాటం ఫలితంగానే ఈ నిర్ణయం



వచ్చిందని నాయకులు తెలిపారు. రోగులకు మందులు అందక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని సీఐటీయూ ప్రతినిధులు పలుమార్లు ఈఎస్ఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గతంలో ఇతర ప్రాంతాలకు తరలించిన ప్రత్యేక మందుల సరఫరాను తిరిగి రామచంద్రాపురం ఆసుపత్రిలోనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయంతో వేలాది మంది ఈఎస్ఐ రోగులకు ఉపశమనం కలగనుంది. ఈ మేరకు జాయింట్ డైరెక్టర్ కాంతి సాగర్ అధికారిక ఉత్తర్వుల ప్రతిని సీఐటీయూ నాయకత్వానికి అందజేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ, ఈఎస్ఐకి చందాలు చెల్లిస్తున్న కార్మికులకు నాణ్యమైన వైద్యం, అవసరమైన మందులు అందించడం అధికారుల బాధ్యత అన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వాజిద్దలి మాట్లాడుతూ, ఇది మందుల పునరుద్ధరణ మాత్రమే కాకుండా ఈఎస్ఐ రోగుల హక్కుల కోసం చేసిన పోరాటానికి లభించిన విజయమన్నారు. భవిష్యత్‌లో మందులు, శస్త్రచికిత్స సామగ్రి, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఈఎస్ఐ బోర్డు సభ్యుడు అర్జున్, తదితరులు పాల్గొన్నారు..

# స్వీట్ కార్న్ సాగుతో రైతులకు లాభాల బాట

**- సకాటా సీడ్స్ స్వీట్ క్వీన్**

**0174పై రైతులకు అవగాహన**

**- 80--85 రోజుల్లో కోత..**

**- మార్కెట్‌లో మంచి డిమాండ్**

గజ్వేల్ నియోజకవర్గం:05 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం కుకునూర్‌పల్లి మండలం చిన్నకిష్టాపూర్




గ్రామంలో సకాటా సీడ్స్ సంస్థకు చెందిన స్వీట్ క్వీన్ 0174 రకం స్వీట్ కార్న్‌పై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు సుకేశ్ వ్యవసాయ పొలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు స్వీట్ కార్న్ సాగు విధానం,పంట కాలం, దిగుబడి,మార్కెట్ డిమాండ్ తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సకాటా సీడ్స్ కంపెనీ ప్రతినిధి సంపత్ కుమార్ మాట్లాడుతూ. స్వీట్ క్వీన్ 0174 రకం 80 నుంచి 85 రోజుల్లో కోతకు వస్తుందని తెలిపారు. ఒక్క కంకి సుమారు 600 నుంచి 700 గ్రాముల వరకు బరువు ఉంటుందని,ఏడాది పొడవునా ఈ రకాన్ని సాగు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. రైతు సుకేశ్ మాట్లాడుతూ స్వీట్ క్వీన్ 0174 తక్కువ కాలంలో కోతకు రావడంతో పాటు ఆకర్షణీయమైన ఆకుపచ్చ రంగు కలిగి ఉండటం వల్ల మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ రకంలో సుమారు 60 శాతం వరకు రెండు కంకులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీలర్ పద్మావతి రైతు సేవా కేంద్రానికి చెందిన వినోద్, ప్రశాంత్,రాజేష్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# బీరంగూడ కాలనీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## పెండింగ్ పనులు తక్షణమే చేపట్టాలి: శశిధర్ రెడ్డి

అమీన్‌పూర్, సెప్టెంబర్ 5 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్



అధ్యక్షులు శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాలనీ వాసులతో కలిసి శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు మల్లారెడ్డి కాలనీ, మారుతి నగర్, లక్ష్మీ సాయి మెడోస్, వందనపురి, బీహెచ్‌ఎల్ మెట్రో, ఎన్‌ఎస్‌ఎల్, లింగమయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. పెండింగ్ అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు శశిధర్ రెడ్డి తెలిపారు.

# బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 18 అడుగుల గణనాథుడు,
- పూరీ జగన్నాథ్ ఆలయ శైలిలో మండపం
- బాలాపూర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం భాగ్యనగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని బాలాపూర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది బాలాపూర్ గణనాథుడు భక్తులకు 18 అడుగుల భారీ విగ్రహ రూపంలో దర్శనమివ్వనున్నారు. విగ్రహ తయారీకి రూ. 3.20 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో మండపం**

ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా బాలాపూర్ వినాయక మండపాన్ని పూరీ జగన్నాథ ఆలయ నమూనాలో ఏర్పాటు చేయనున్నారు. దిల్ సుఖ్ నగర్ కు చెందిన ప్రముఖ డెకరేటర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండప నిర్మాణం జరుగుతోంది. మండపం కోసం ఏకంగా రూ. 40 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

**భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు:**

ఉత్సవాలకు భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పటిష్ట చర్యలు చేపట్టారు. పార్కింగ్: వాహనాల పార్కింగ్ కోసం హనుమాన్ టెంపుల్ వెనకాల ఉన్న 8 ఎకరాలతో పాటు, సాయి హోమ్స్ కాలనీ పక్కన ఉన్న 6 ఎకరాల్లో ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. క్యూ లైన్లు: గణేష్ చౌక్ వద్దనే ఇన్, ఔట్ ఏర్పాటు చేశారు. గణేష్ చౌక్ నుంచి మండపం వరకు రెండు క్యూ లైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

దర్శనం అనంతరం మరో ద్వారం గుండా బయటకు పంపించనున్నారు. ప్రత్యేక దర్శనాలు: చిన్నపిల్లలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్, అలాగే బాలాపూర్ గ్రామస్తుల కోసం మరో ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. చెప్పుల స్టాండ్: గత ఏడాది భక్తులు పాదరక్షల కోసం ఇబ్బంది పడ్డారనే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది గణేష్ చౌక్ పక్కనే పాదరక్షలు భద్రపరిచేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు.

**కట్టుదిట్టమైన భద్రత:**



ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 100 సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 100 మంది వాలంటీర్లు మండపం వద్ద ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

# మహేశ్వరంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్

మహేశ్వరం, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ గారు ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని మరింత సులభంగా



అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రేషన్ కార్డు ద్వారా నిత్యావసర సరుకులు పొందడమే కాకుండా, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు అర్హత లభిస్తుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్న, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, గ్రామ పాలనాధికారి లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుజాత, అంగన్ వాడీ టీచర్లు, రేషన్ కార్డు లబ్ధిదారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డబ్బుల విషయంలో వాగ్వాదం

- కుమారుడి దాడిలో తండ్రి మృతి
- అనారోగ్యంతో ఉన్న తండ్రిపై దాడి..
- పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు



గజ్వేల్ నియోజకవర్గం:05 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

డబ్బులు అడిగిన కుమారుడికి ఇవ్వలేనని చెప్పడంతో జరిగిన వాగ్వాదంలో తండ్రిపై కుమారుడు దాడి చేయగా,అనంతరం ఆయన మృతి చెందిన ఘటన ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవి మజీద్ అలియాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు ఎన్ఐ వి.రఘుపతి తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొమ్ము ఆంజనేయులు (50) గత మూడేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నారు.ఆయనకు భార్య లక్ష్మి,కుమారుడు నవీన్ ఉన్నారు.ఈ నెల 4వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో నవీన్ తన తండ్రిని డబ్బులు అడిగాడు. ప్రస్తుతం తన వద్ద డబ్బులు లేవని, తరువాత ఇస్తానని ఆంజనేయులు చెప్పడంతో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది.ఈ క్రమంలో నవీన్ తన తండ్రిని చేతులతో కొట్టడంతో ఆంజనేయులు గోడకు పడిపోయి గాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆంజనేయులు అనారోగ్యంతో ఉన్నందున ఆయనపై దాడి చేయవద్దని కుటుంబ సభ్యులు చెప్పినా నవీన్ వినలేదని తెలిపారు. అనంతరం నవీన్‌ను ఇంటి నుంచి బయటకు పంపించి,గాయపడిన ఆంజనేయులను కుటుంబ సభ్యులు ఇంట్లో పడుకోబెట్టారు. అయితే ఈ నెల 5వ తేదీ ఉదయం సుమారు 6.30 గంటలకు లేచి చూడగా ఆంజనేయులు మృతి చెంది ఉన్నట్లు ఆయన భార్య లక్ష్మి గుర్తించారు.తన భర్త అనారోగ్య పరిస్థితి తెలిసినప్పటికీ కుమారుడు దాడి చేయడం వల్లే మృతి సంభవించిందని,నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించామని,నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్ఐ వి.రఘుపతి తెలిపారు.ఘటనకు దారితీసిన పరిస్థితులు,మృతికి అసలు కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజ్ సమస్య

- శాశ్వత డ్రైనేజ్ సమస్యకు పరిష్కారం కోసం కృషి చేస్తా
- ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 05, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం అల్మాస్‌గూడలోని జయశంకర్ కాలనీ ప్రధాన రహదారిలో ఎన్నో ఏళ్ళ గా నెలకొన్న డ్రైనేజీ సమస్య కారణంగా స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కాలనీ ప్రెసిడెంట్ సంజయ్ ఏఐసీసీ -విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా స్థానిక ప్రజలు ఎన్నో రోజులుగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో గతంలో సరైన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.స్థానికుల సమస్యను తెలుసుకున్న బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్ గారితో కలిసి వెంటనే స్పందించి, బడంగ్‌పేట్ సర్కిల్ 16 డి ఈ రూప గారు, ఏఈ గంగా



ప్రసాద్ ని సమస్య ఉన్న ప్రాంతానికి రప్పించి, డ్రైనేజీ పరిస్థితిని వారికి ప్రత్యక్షంగా వివరించారు.అలాగే జోనల్ ఎస్ ఈ క్రిష్టప్ప గారికి ఫోన్ ద్వారా సమస్యను వివరించి, జయశంకర్ కాలనీతో పాటు స్థానిక కాలనీలలో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే విధంగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం తెలుసుకోవడం మాత్రమే కాకుండా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గారు తెలిపారు.ఈ కార్యక్రమం లో కాలనీవాసులు వరికుప్పల శంకర్, జంగయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# "బాల్య వివాహాలకు నో చెప్పండి - బాలల భవిష్యత్తును కాపాడండి"

దుబ్బాక సెప్టెంబర్ సెప్టెంబర్ 05.

బాల్య వివాహాలు బాలల భవిష్యత్తుకు సంకెళ్లుగా మారుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని స్థానిక ఎస్ఐ కే. మానస అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్, డీసీపీవో ఆదేశాల మేరకు రాయపోల్ మండల కేజీబీవీలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన చట్టం--2006పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మానస మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసిన వారు, చూసి కూడా అడ్డుకోని వారు, సహకరించిన వారు శిక్షార్హులవుతారని తెలిపారు. 18 ఏళ్లలోపు బాలికలకు, 21 ఏళ్లలోపు బాలురకు వివాహాలు చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని, జీవితంలో స్థిరపడకముందే ప్రేమ, పెళ్లిళ్ల పేరుతో నిర్ణయాలు తీసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని కోరారు. ఆశ్రిత సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ బండకాడి గణేష్ మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాధితులకు కౌన్సెలింగ్ అందించి, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం ఎస్ఐ మానస 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఓ సుగంధలత, ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సుగంధలత, ఉపాధ్యాయ బృందం, కమ్యూనిటీ సోషల్ వర్కర్లు మౌనిక, వీణ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ దిష్టిబొమ్మ దహనంపై బీఆర్ఎస్ ఫిర్యాదు

## కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేయాలి..

## వారం రోజుల్లో చర్యలు లేకుంటే భారీ ఆందోళన: వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్:05 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి,సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు,నర్సారెడ్డి అనుచరులపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి గజ్వేల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి గజ్వేల్ ఎస్ఐకి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి అవమానించిన వారిపై ప్రజాస్వామ్యబద్ధంగా వారం రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోకపోతే సుమారు 10 వేల మందితో కోట మైసమ్మ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి,ఇందిరాపార్క్ చౌరస్తా వద్ద దహనం చేస్తామని హెచ్చరించారు. ఆ సమయంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేస్తే గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఎదుట టెంట్లు వేసుకుని బైఠాయిస్తామని తెలిపారు. గజ్వేల్ కాంగ్రెస్ నాయకులు అధికార పక్షంలో ఉన్నారో,ప్రతిపక్షంలో ఉన్నారో వారికే అర్థం కావడం లేదని వంటేరు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి,రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో నిలిపిన కేసీఆర్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం,ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడం సరికాదని అన్నారు. అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి,మంత్రులు అభివృద్ధి చేయకపోయినా,సంక్షేమ పథకాలు అమలు చేయకపోయినా,ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయినా ప్రతిపక్షాలు అధికార పార్టీని రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సహజమన్నారు. అయితే ఇందుకు భిన్నంగా అధికార కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంగా అభివర్ణించారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు,పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా,మాజీ జెడ్పీటీసీ పంగా మల్లేశం,కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం.

## రాయపోల్ ఎస్ఐ మానస.

## మండల విద్యాధికారి రాజగోపాల్ రెడ్డి.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 05.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తుకు పునాది పడుతుందని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని రాయపోల్ ఎస్ఐ మానస, మండల విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు బాటలు వేస్తారని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి ప్రతి ఒక్కరూ వారికి గౌరవం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, రాజకుమార్, హనుమంత రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ సుగంధ లత, పిఆర్టియు మండల అధ్యక్షులు నాగరాజు, టియుపిఎస్ మండల అధ్యక్షులు రవి, టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కనకయ్య, ఎస్టిటియు మండల ప్రధాన కార్యదర్శి నరసింహ, సీఆర్పీలు యాదగిరి, స్వామిగౌడ్, ఎల్లాగౌడ్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## 39 సంవత్సరాలుగా శ్రీ సాయివాణి విద్యానికేతన్ విద్యా సంస్థ...

**- కరస్పాండెంట్ డా వీరమనేని సంపత్ రావు...**



మల్హర్ సెప్టెంబర్ 05 ప్రజాకలం ప్రతినిధి... మండల కేంద్రమైన తాడిచెర్ల లో 39 సంవత్సరాలుగా శ్రీ సాయివాణి విద్యానికేతన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నంబర్ 1 స్థానం లో నిలిచిందని కరస్పాండెంట్ వీరమనేని సంపత్ రావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్‌లో ఘనంగా వరల్డ్ తైక్వాండో దినోత్సవం

**- రాష్ట్రస్థాయి ప్రతిభ కనబరిచిన తైక్వాండో విద్యార్థులకు ఘన సత్కారం**



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 05 (ప్రజా కలం):

వరల్డ్ తైక్వాండో దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన తైక్వాండో విద్యార్థులను క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రమేష్ చంద్ర ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులకు వరల్డ్ తైక్వాండో దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా తైక్వాండో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. తైక్వాండో ద్వారా నాగర్ కర్నూల్ జిల్లాకు మంచి పేరు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తైక్వాండో నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. క్రమం తప్పకుండా తైక్వాండో సాధన చేయడం వల్ల విద్యార్థులు శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా తైక్వాండో జనరల్ సెక్రటరీ మాస్టర్ రవి కుమార్, క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేంద్ర సార్, టీచర్ కురుమయ్య సార్ పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కార్యక్రమంలో పాల్గొని తైక్వాండోలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులను అభినందించారు.




## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### ఆరుగురు అరెస్టు.. రూ.23,580 నగదు, 6 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం

ధర్మారం, సెప్టెంబరు 5 (ప్రజాకలం ప్రతినిధి):

మండలంలోని మేడారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మేడారం గ్రామ శివారులోని ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు.

ఈ దాడిలో ధర్మారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కొంగల శ్రీనివాస్, సామంతుల నర్సయ్య, తిరుపతి, సుంకపాక దేవదాస్, దామెర స్వామి, ఎన్. వెంకటేష్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 23,580 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.



# మల్లన్న సాగర్ నిర్వాసితుల పరిస్థితి అత్యంత దయనీయం

**- నమ్మించి నట్టేట ముంచిన బిఆర్ఎస్ ప్రభుత్వం**
**- అండగా ఉంటానని హామీ ఇచ్చి చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి**
**- టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు కొట్టాల యాదగిరి**

గజ్వేల్:05 సెప్టెంబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లన్న సాగర్ నిర్వాసితుల బ్రతుకులు అత్యంత దయనీయంగా ఉన్నట్లు టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం గజ్వేల్ శివారులోని ఆర్అండ్ఆర్ కాలనీ సందర్శించి ముంపు బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడారు.మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాల్సిన అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోకపోగా,మాజీ మంత్రి హరీష్ రావు, అప్పటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి హామీల పేరుతో నమ్మించి గొంతు కోసినట్లు స్పష్టం చేశారు.అయితే అండగా ఉంటానని హామీ ఇచ్చిన ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి చేతులెతేయగా,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కండ్లు తెరిపించి అప్పటి హామీలు సాధిస్తామని తెలిపారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ తో కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చగా, కొండపాక, తొగుట మండలాల పరిధిలోని 7 పంచాయతీలు,ఆరు ఆవాస గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించి బాధితులను అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఈడ్చికొచ్చినట్లు గుర్తు చేశారు. మున్సిపల్ పరిధిలో అరకొర వసతుల మధ్య పునరావాసం కల్పించగా, స్థిరమైన ఉపాధి లేక వారు అర్ధాకలితో చస్తున్నట్లు చెప్పారు.ముఖ్యంగా మల్లన్న సాగర్ లో చేపలు పట్టే అవకాశం అనుమతి ఇవ్వకపోవడం, జీవనోపాధి లేకపోవడం,బ్యాంకర్లు ముందుకు రాకపోవడం తదితర కారణాలతో ముంపు బాధితులు నిత్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నట్లు పేర్కొన్నారు.అయితే వివిధ రకాల హామీలు,పరిహారం చెల్లింపు,వర్గల్ పారిశ్రామికవాడలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అరచేతిలో వైకుంఠం చూపిన హరీష్ రావు, వెంకట్రాంరెడ్డి పత్తా లేరని అన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కాకుండా నిర్వాసితులకు పునరావాసంతో పాటు గౌరవప్రదమైన జీవితం,స్థిరమైన ఉపాధి, ఆదాయ వనరులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. అయితే భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీల్లో భాగంగా పరిశ్రమల్లో అవకాశం ఇవ్వాలని,మల్లన్న సాగర్ రిజర్వాయర్ లో చేపల పెంపకం చేపట్టి పట్టుకునే అవకాశం ఇవ్వాలని,ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను గుర్తించి ఆదుకోవాలని, ప్రభుత్వం నేరుగా ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు.లేని పక్షంలో నిర్వాసిత గ్రామాలకు ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.సర్వం కోల్పోయిన బాధితుల ఆగ్రహానికి గురికాకముందే బిఆర్ఎస్ నేతలు,ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు,పట్టణ యువజన అధ్యక్షులు కూరాకుల శ్రీకాంత్, లింగని రాజు,నాంపల్లి, నరేష్ చారీ టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చని రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి

**రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్**



గజ్వేల్:05సెప్టెంబర్ ( ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్ ఆరోపించారు.ఆరు గ్యారంటీలు,420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటలను విస్మరించిందని విమర్శించారు.ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని,వాటిలో ఎన్ని హామీలు అమలు చేశారో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందిరైతుల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని దేవి రవీందర్ ఆరోపించారు.రైతుబంధు, రుణమాఫీ, రైతు భరోసా,పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ తదితర అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు పొంతన లేదన్నారు.గతంలో రైతులకు అండగా నిలిచిన రైతుబంధు,రైతుబీమా వంటి పథకాలపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు.రైతు ఓట్లు అడిగే సమయంలో ప్రాధాన్యత ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.సొంత ఎమ్మెల్యేలకే స్వేచ్ఛ లేదా?కాంగ్రెస్ ప్రభుత్వంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలే స్వేచ్ఛ లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఏర్పడిందని దేవి రవీందర్ అన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు కాకుండా సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వ పనితీరుపై మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. "ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యేలకే మాట్లాడే స్వేచ్ఛ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ఇదేనా కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం?"అని ప్రశ్నించారు.వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తే అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని,ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోలేదని,ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి మాటను గుర్తుంచుకున్నారని దేవి రవీందర్ అన్నారు. హామీలను నెరవేర్చడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు రవేష్ గౌడ్,భాస్కర్,శిల్ప, నర్సింలు,మాజీ సర్పంచులు మైపాల్, కిరణ్,ఉప సర్పంచ్ నాగరాజు,కిషన్, కనకయ్య,శ్రీనివాన్ తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**టీజీజాక్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్ కన్వీనర్ డాక్టర్ కె. రామారావు**

రంగారెడ్డి, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీజాక్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్ కన్వీనర్ డాక్టర్ కె. రామారావు అన్నారు.టీజీజాక్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్ మరియు కన్వీనర్ డాక్టర్ కె. రామారావు ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని రంగారెడ్డి జిల్లా టీఎన్జీవో భవన్ లో సన్నాహక సమావేశం నిర్వహించారు.2026 సెప్టెంబర్ 10న నిర్వహించనున్న టీజీజాక్ "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు.రంగారెడ్డి జిల్లాకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు అనుబంధ సంఘాల సభ్యులను పెద్ద సంఖ్యలో సమీకరించి చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని నిర్ణయించారు. అలాగే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నియోజకవర్గాల వారీగా పర్యటనలు, విస్తృత ప్రచారం మరియు సమీకరణ కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో టీజీజాక్ జిల్లా చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. కె. రామారావు, కో-కన్వీనర్ శ్రీనేష్ కుమార్ నోరి, నూతనకంటి వెంకట్, శ్రీనివాస్ తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అన్ని అనుబంధ సంఘాలు సమిష్టిగా కృషి చేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




## రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా చూడాలి

**రావిరాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి**



మహేశ్వరం, సెప్టెంబర్ 05,(ప్రజా కలం)

రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా చూడాలని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అమ్మవారిని కోరారు.రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి రావిరాలలోని ప్రసిద్ధ సూర్యగిరి ఎల్లమ్మ మాతల్లిని శనివారం నాడు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ కమిటీ ఛైర్మన్, వ్యవస్థాపకులు రెడ్డిగల్ల రత్నం తో పాటు గుడి కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ గుడి కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.